
వేసవిలా పెరుగుతోంది



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గడచిన ఆరు రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలు, ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్తు వినియోగం బాగా పెరిగింది. గత నెలలో వినియోగం రోజుకు సుమారు 18 మిలియన్ యూనిట్లు ఉండేది. వాతావరణంలో మార్పుల కారణంగా ఎండల వేడి, విపరీతమైన ఉక్కపోతతో పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు నమోదవుతున్నాయి. దీంతో వేడిని తట్టుకోలేక ప్రజలు అల్లాడుతున్నారు.

ఏసీలు, కూలర్ల వినియోగం ఒక్కసారిగా పెరిగింది. పగలు, రాత్రుళ్లు కూడా వీటిని ఉపయోగిస్తున్నారు. దీంతో విద్యుత్తు వినియోగం ఒక్కసారిగా 20 మిలియన్ యూనిట్లకు చేరింది. గత నాలుగు రోజులుగా 19 నుంచి 20 మిలియన్ యూనిట్లకు వినియోగం పెరిగింది. శని, ఆదివారాల్లో ఇది 20.645 మిలియన్ యూనిట్లు. జంగారెడ్డిగూడెం డివిజన్‌లోనే 2 లక్షల యూనిట్ల వినియోగం జరుగుతోంది. అయిదు రోజులకు ముందు ఇక్కడ 1.8 మిలియన్ యూనిట్లు వినియోగం ఉంటే అది 2 మిలియన్‌లకు చేరింది. ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు 26 లక్షల యూనిట్లు అధిక వినియోగం జరుగుతోందని ఎస్ఈ సాల్మన్ రాజు పేర్కొన్నారు. డిమాండుకు తగిన సరఫరా ఉండటం వల్ల జిల్లా పరిధిలో ఎక్కడ ఇబ్బంది లేదని చెప్పారు.

ఈ-పంట నమోదుకు అవకాశం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది. కానీ కౌలు రైతులకు కాకుండా యజమానుల ఖాతాల్లో పరిహారం జమ కావడంతో వాస్తవ సాగుదారులు నష్టపోతున్నారంటూ కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఈ-పంట నమోదుకు అక్టోబరు 7వ తేదీ వరకు అవకాశం కల్పించారని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.


తాడేపల్లిగూడెం: బలుసులమ్మ


కాళ్ల: కోమటిగుంటలో..

దేవీ శాంభవి.. దీన బాంధవి..

తాడేపల్లిగూడెం, కాళ్ల, న్యూస్‌టుడే: జిల్లాలోని దేవీ క్షేత్రాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో ఆదివారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు.

పోడూరులో 15.4 మి.మీ. వర్షం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు 1.7 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. పోడూరులో అత్యధికంగా 15.4 మి.మీ వర్షం కురిసింది. పెనుమంట్రలో 9.2, ఆచంటలో 9 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

గుబ్బలమంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రులు, ఆదివారం కావడంతో బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బలమంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు.



మొక్కేదీ.. లెక్కేదీ

రూ.కోట్ల ప్రజాధనం వృథా


తణుకులోని తేతలి లే అవుట్‌లో కనిపించని మొక్కలు


- తణుకు నియోజకవర్గంలో 120 లే అవుట్లలో రోడ్డుకిరువైపులా 50 వేల మొక్కలకు పైగా నాటినట్లు చెబుతున్నారు. తేతలి లేఅవుట్‌లో 16.36 ఎకరాల్లోనే సుమారు మూడు వేల మొక్కలు నాటినట్లు చెబుతున్నా కనిపించని పరిస్థితి.
- భీమవరం మండలంలో 19 లే అవుట్లలో కొమరాడ, అనాకోడేరు, తుందుర్రు, దొంగపిండి, కొత్తపూసలమూరు, లోసరి, దెయ్యాలతిప్ప లేఅవుట్లలో సుమారు 14 వేల మొక్కలు వేసినట్లు చెబుతున్నా సంరక్షణకు చర్యలు తీసుకోకపోవడంతో మొక్కల ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు.
- రాయలం, చిన అమిరం, కొవ్వాడ అన్నవరం, తాడేరు లేఅవుట్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: మొక్క నాటగానే సంబరం కాదు... నీళ్లు పోయాలి. ఎదిగే వరకు సంరక్షించాలి. వృక్షంలా మారాలి. పదుగురికి నీడనిస్తే... అప్పుడు లక్ష్యం నెరవేరినట్లు. జిల్లాలో పచ్చదనం అభివృద్ధి, సంరక్షణ పేరుతో గత ప్రభుత్వం చేపట్టిన జగనన్న పచ్చతోరణం గుత్తేదారులకు, కొంతమంది అధికారులకు కాసులు కురిపించాయి తప్ప నీడనిచ్చిన దాఖలాలు లేవు. 'గ్రామాల్లో సామాజిక తనిఖీకి వెళ్లినప్పుడు పేదలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాల లే అవుట్లలో నాటిన మొక్కలు పరిశీలించాం. చాలా వరకు లేవు' అని గతంలో సామాజిక తనిఖీలో భాగంగా అధికారులు అన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

చూసీ చూడనట్లు వ్యవహరించడంతో.. జిల్లాలో జగనన్న లే అవుట్లలో మొక్కలు వేసి సంరక్షించాలని గత వైకాపా సర్కారు జగనన్న పచ్చతోరణం పథకాన్ని తెరపైకి తెచ్చింది. అటవీశాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. దీనిలో చాలా వరకు వైకాపా నాయకులే గుత్తేదారులుగా మారి మొక్కలు వేయకుండా వేసినట్లు... పెంచకుండా పెంచినట్లు చూపారనే ఆరోపణలు ఉన్నాయి. నిధులు పక్కదారి పట్టినా అప్పటి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో జగనన్న పచ్చతోరణం అక్రమాల తోరణంగా మారింది.

సంరక్షణ కొరవడి.. జిల్లాలో 2019-22 మధ్య అన్ని మండలాల్లో పథకం అమలు చేశారు. ఆరడుగుల ఎత్తు, రెండేళ్ల వయసున్న మొక్కలనే నాటాలని సూచించింది. కానీ ఎక్కడా అవి అమలు కాలేదు. దాదాపు రెండు వేల కిలోమీటర్లకు పైగా సుమారు ఎనిమిది లక్షల మొక్కలు నాటినట్లు, వాటి సంరక్షణకు రూ.కోట్లు వెచ్చించినట్లు చెబుతున్నారు. వాస్తవానికి నిర్వహణ సరిగ్గా చేపడితే 85 శాతం మొక్కలు బతకాలి. మొక్కల కొనుగోలు, ట్రీ గార్డులు, వాటి సంరక్షణకు ఏటా సుమారు రూ.3 కోట్లు ఖర్చు చేశారని కొంత మంది అధికారులు వాపోతున్నారు.

'ఉపాధి' పథకంలో భాగంగా చేపట్టిన మొక్కల పెంపకానికి ఖర్చు (రూ.)



ఒక్కో మొక్క గొయ్యికి	52.90
రవాణాకు	3
అంతర్గత రవాణాకు	2.30
నాటేందుకు	9.12
కంచె కట్టేందుకు	140

ఎరువు వేసేందుకు, నీళ్లు పోసేందుకు అదనపు ఖర్చులు చూపించారు.

జిల్లాలో జగనన్న లేఅవుట్లు	630
నాటిన మొక్కలు	8 లక్షలు
ఖర్చు చేసింది	రూ. 18 కోట్లు

దీనిపై డ్వామా పీడీ అప్పారావు స్పందిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితి సమీక్షించి చర్యలు తీసుకుంటామన్నారు.

చేదు జ్ఞాపకానికి ఆనవాళ్లు..!





కప్పుటి తీపి జ్ఞాపకాలు, చేదు అనుభవాలకు గుర్తులుగా కొన్ని ఆనవాళ్లు నిలుస్తుంటాయి. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం చినమైనవానిలంక సముద్ర తీరంలో శిథిల తుపాను భవనం ఇలాంటి కోవలోదే. జిల్లాలోని సముద్ర తీరం వెంబడి చినమైనవానిలంక, బియ్యపుతిప్ప గ్రామాలు ఉండేవి. వీటిలో సుమారు అయిదువేల మంది నివసించేవారు. 2004 డిసెంబరు 26న సంభవించిన సునామీ కారణంగా చినమైనవానిలంక, బియ్యపుతిప్పలు కడలి గర్భంలో కలిసిపోయాయి. దీంతో ఇక్కడి ప్రజలంతా 2 కి.మీ. దూరంగా వెళ్లి అవే పేర్లతో కొత్తగా గ్రామాలను ఏర్పాటు చేసుకున్నారు. కొన్నేళ్లు గడిచిన తర్వాత చినమైనవానిలంకలో అలనాటి తుపాను రక్షిత భవనం, రామాలయం, వంతెనలు కొంతమేర సముద్రం నుంచి బయటపడ్డాయి. అనంతరం సముద్ర అలల దిశ మారడం, సముద్రం కొంతమేర వెనక్కి మళ్లడంతో తుపాను రక్షిత భవనం పూర్తిగా కనిపిస్తోంది. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు దీనిని ఆసక్తిగా తిలకిస్తూ ఆనాటి స్థానికుల అనుభవాలను తెలుసుకుంటున్నారు.

\- ఈనాడు, నరసాపురం

ఇస్రో విజయాలు గర్వకారణం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా భీమవరంలోని విష్ణు విద్యాసంస్థల ఆవరణలో రాకెట్ నమూనాల ప్రదర్శన ఆదివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలు, విశ్వం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. శ్రీహరికోటలోని షార్ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ టి.ఎస్. రఘురామ్ మాట్లాడుతూ ఇస్రో సాధించిన విజయాలు మన దేశానికి గర్వకారణమన్నారు. అంతరిక్ష పరిశోధనలు కేవలం అన్వేషణ కోసం మాత్రమే కాదని.. భూమిపై జీవన ప్రమాణాల మెరుగుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఎస్‌డీఎస్‌సీ జనరల్ మేనేజర్ పి.ఏడుకొండలు, విష్ణు స్కూల్ ప్రిన్సిపల్ బిందు, ఇస్రో శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. రాకెట్ నమూనాలతో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు సోమవారంతో ముగుస్తాయి.



రాకెట్ నమూనా వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ నాగరాణి

సర్కారు బడుల్లో వృత్తివిద్య

9, 10 తరగతుల్లో వృత్యంతర శిక్షణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయిలోనే వృత్తివిద్యా కోర్సుల్లో అవగాహన కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వివిధ పాఠశాలల్లో అమల్లో ఉన్న వృత్తివిద్యా కోర్సులకు సంబంధించిన అంశాల బోధనతో పాటు క్షేత్ర పరిశీలన కూడా కొనసాగుతోంది. భీమవరం పరిసరాల్లో ఎంపిక చేసిన పాఠశాలల విద్యార్థులు ఇటీవల ఉపాధ్యాయులు, శిక్షకుల ఆధ్వర్యంలో పరిశ్రమలు, వ్యాపార సముదాయాలను పరిశీలించారు.


వస్త్ర దుకాణంలో విక్రయాల గురించి తెలుసుకుంటున్న విద్యార్థినులు

లక్ష్యం ఇదీ..! పదో తరగతి పూర్తయ్యే నాటికి ప్రతి విద్యార్థి కనీసం రెండు అంశాల్లో వృత్తి నైపుణ్యం సాధించేలా తీర్చిదిద్దేందుకు పీఎంశ్రీ కార్యక్రమాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. 2023లో దీనిని ప్రారంభించగా 2027 వరకు అమల్లో ఉంటుంది. దేశ వ్యాప్తంగా 14,658 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. అక్కడ 9, 10 తరగతుల విద్యార్థులకు వృత్తివిద్యా కోర్సులు నేర్పుతారు. 120 రకాల కోర్సులు ఉండగా ప్రతి పాఠశాలకు రెండు చొప్పున కేటాయించారు.

☛ ఈ కార్యక్రమంలో భాగంగా 9, 10 తరగతులకు రెండేసి కోర్సుల్లో వృత్యంతర శిక్షణ ఉంటుంది. ప్రతి పాఠశాలకు ఇద్దరు శిక్షకులను కేంద్రం నియమించింది. వారి పర్యవేక్షణలో నిర్వహించే తరగతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు చేస్తారు. ఒక్కో తరగతిలో 50 నుంచి 60 మంది విద్యార్థులుంటారు.

జిల్లా ఎంపికైన పాఠశాలలు.. ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ (బి) జూనియర్ కళాశాల ఎల్‌బీచర్ల(నరసాపురం), ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ కడకట్ల (తాడేపల్లిగూడెం), ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (జి) ఆచంట, బీఆర్ ఎంవీఎంపీఎల్ ఉన్న పాఠశాల (పాలకొల్లు), జీహెచ్ఎస్- పోస్టు బేసిక్ (పెంటపాడు), జీహెచ్ఎస్ (యండగండి), జెఎల్బీ ఎంపీఎల్ హెచ్ఎస్ (భీమవరం), ఎంపీఎల్, పీఎస్ (ఎస్ఎల్ఎన్) రాయపేట (నరసాపురం). ఎంపీయూపీఎస్ (వేల్పూరు) ఆచంట వేమవరం, బల్లిపాడు, ఆకివీడు, తణుకు, చినకాపవరం, గూట్లపాడు, ఇరగవరం, కలవపూడి, కవిటం, మార్టేరు, మోగల్లు, మొగల్తూరు, శివదేవుని చిక్కాల, తాడేపల్లిగూడెం, వీరవాసరం జడ్పీ ఉన్నత పాఠశాలలు.

నిలిచిన కంటి వైద్యం

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు కళ్ల జోళ్లు అందించే ముఖ్యమంత్రి 'ఐ కేర్' సేవలు పక్షం రోజులుగా నిలిచిపోయాయి. జిల్లాలో భీమవరం, నరసాపురం, పాలకొల్లు, ఆచంట, పెనుగొండలోని ఏరియా ఆసుపత్రుల్లో ఈ సేవలు అందుబాటులో ఉండేవి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రజలకు కళ్ల జోళ్లు అందించేవారు.


నరసాపురం: నేత్ర వైద్య సేవలు అందించే విభాగం


ముగిసిన గడువు.. నేత్ర సంబంధ సమస్యలు ఉండి అవసరం ఉన్న వారికి ఉచితంగా కళ్ల జోళ్లు అందించడం, ఆరోగ్యశ్రీ పథకంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించడం ఈ పథకం ఉద్దేశం. దీనికి ప్రభుత్వం గతంలో అపోలో హెల్త్ కేర్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పంద గడువు సెప్టెంబరు 17తో ముగిసింది. దీంతో ఈ సేవలు నిలిచిపోయాయి.

పునరుద్ధరిస్తే ప్రయోజనం.. ఈ పథకం పునరుద్ధరిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఈ పథకంలో లబ్ధిదారులకు ఉచితంగా అందించే కళ్ల జోళ్ల నాణ్యత ఉండేవి కావని, సరఫరా చేసిన పదో, ఇరవై రోజులకో ఫ్రేములు దిబ్బతినేవని ప్రజలు చెబుతున్నారు. పథకం పునరుద్ధరిస్తే నాణ్యతపై కూడా దృష్టి నిలపాలని కోరుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా డీసీహెచ్ఎస్ పి.సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ పథకంలో సేవలు నిలిచిపోయిన తీరుపై ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు.

తొలి అంకానికి తప్పని తిప్పలు

మద్యం దరఖాస్తులకు ధ్రువపత్రం తప్పనిసరి

ఈనాడు డిజిటల్, భీమవరం, అత్తిలి, తణుకు గ్రామీణం, నరసాపురం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలను దక్కించుకోవడంలో మొదటి అంకమైన డీడీలు తీయడంలో ఆశావహులకు అనుకోని కష్టాలు ఎదురవుతున్నాయి. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు నింపి వాటికి రూ.2 లక్షల డీడీతో పాటు వాటి జెన్యునెస్ (ఒరిజినల్) ధ్రువపత్రం అడగడంతో పాత వ్యాపారుల సంగతి ఎలా ఉన్నా కొత్త వారికి ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. మరో మూడు రోజులే సమయం ఉండటంతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో మద్యం దుకాణాల టెండర్ల సమయంలో కొంత మంది దరఖాస్తు రుసుం డీడీలను కలర్ జిరాక్స్ తీసి దరఖాస్తులకు జత చేయడం, ఒరిజినల్ డీడీలను వారి వద్ద ఉంచుకోవడం జరిగింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏ బ్యాంకులో డీడీలు తీశారో ఆ బ్యాంకుల నుంచి డీడీ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని అధికారులు చెబుతున్నారు. ఎస్‌బీఐలో దీనికి ఇబ్బంది లేకపోయినా మిగిలిన బ్యాంకులు చేతులెత్తేయడంతో దరఖాస్తుదారులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అయితే ఆన్‌లైన్‌లో ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లిస్తున్న వారికి ఈ సమస్య లేదు. వ్యాపారులకు ఇబ్బంది లేకుండా దరఖాస్తు అనంతరం సిబ్బందే బ్యాంకుకు వెళ్లి ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్నారని, ఆన్‌లైన్‌లో ఎక్కడ నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చని భీమవరం, తణుకు ఎక్సైజ్ సీఐలు బలరామరాజు, మణికంఠలు తెలిపారు.



మూడు రోజులే గడువు.. జిల్లాలో 175 దుకాణాలకు గాను ఒక్కోదానికి 10 నుంచి 12 దరఖాస్తులు వస్తాయని భావించారు. శనివారం నాటికి 148 మాత్రమే వచ్చాయి. రూ.లక్షలు వెచ్చించి దరఖాస్తు చేస్తే... లాటరీలో దుకాణం వచ్చినా.. రెండేళ్లు ఆ దుకాణాన్ని నడపాలంటే స్థానిక నాయకుల సహకారం ఉండాల్సిందే. లాటరీలో వచ్చినా రాకపోయినా డబ్బు తిరిగివ్వరు. ఒకవేళ దుకాణం వస్తే ఏం చేయాలి, స్థానిక నాయకులు, పోలీసులు, ఇతర ఖర్చులు, హెచ్చరికలు బేరీజు వేసుకుని ఎందుకొచ్చిన తలనొప్పి అని వెనక్కి తగ్గుతున్నారు. సగటున 10 దరఖాస్తులు వచ్చినా రూ.30 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని భావించారు. మరో మూడు రోజులే సమయం ఉండటంతో అటు అధికారులు, ఇటు వ్యాపారుల్లోనూ ఉత్కంఠ నెలకొంది.


మాదివాడ సమీపాన మురికి కూపాల్లా మారిన పొలం

కొల్లేరులా.. వరి చేలు!

భారీ వర్షాలు, కొల్లేరు వరద ప్రభావంతో ఆకివీడు మండల పరిధిలో 2,100 ఎకరాల్లో వరిచేలు పూర్తిగా ముంపుబారిన పడ్డాయి. దాదాపు నెల రోజులు గడిచినా ఆకివీడు, మాదివాడ, అయిభీమవరం, మందపాడు, దుంపగడప, చినమిల్లిపాడు తదితర గ్రామాల్లో అధికశాతం చేలు ఇప్పటికీ ముంపు నుంచి తేరుకోలేదు. వాటిలో తూడు, నాచు పెరిగి కొల్లేరును తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే కలువపూలు సైతం వికసించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. వీటిని తొలగించి మళ్లీ సాగుకు సన్నద్ధం కావడం తలకు మించిన భారమేనని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఆకివీడు


భీమవరంలోని పరీక్ష కేంద్రంలో హాల్‌టిక్కెట్ల పరిశీలనలో అభ్యర్థులు

136 మంది గైర్హాజరు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెంలోని పరీక్ష కేంద్రాల్లో టెట్ ఆదివారం జరిగింది. మూడు కేంద్రాల్లో మొత్తం 846 మంది హాజరు కావాల్సి ఉండగా 136 అభ్యర్థులు గైర్హాజరయ్యారని డీఈవో జి.నాగమణి తెలిపారు. భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 183కు 155 మంది హాజరయ్యారు. డీఎన్నార్ అటానమస్ కళాశాల కేంద్రంలో 211కు 22 మంది గైర్హాజరు కాగా తాడేపల్లిగూడెంలోని శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 452కు 366మంది హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరిగాయి.

ఇసుక కష్టాలకు త్వరలోనే తెర!

● అనుమతులు రాగానే పూర్తిస్థాయి సరఫరా ● 'న్యూస్‌టుడే'తో గనుల శాఖ సహాయ సంచాలకుడు రవిప్రసాద్

భీమవరం టూటౌన్, ఆచంట, న్యూస్‌టుడే: గోదావరి పరివాహక ప్రాంతాన్ని కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జడ్)లో చేర్చడం వల్ల జిల్లా పరిధిలో ఇసుక తవ్వకాలకు అనుమతుల జారీలో జాప్యం జరుగుతుందని.. ఈ సమస్యను అధిగమించి వీలైనంత త్వరగా అన్ని రీచ్‌లలో తవ్వకాలు చేపట్టి ఉచిత ఇసుకను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టామని గనుల శాఖ జిల్లా సహాయ సంచాలకుడు రవి ప్రసాద్ తెలిపారు. ఇటీవల జిల్లాలో బాధ్యతలు చేపట్టిన ఆయన పలు అంశాలపై 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. వివరాలు ఇలా..

కేంద్రం పరిధిలో.. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఆరు ఓపెన్, అయిదు బోట్‌మ్యాన్ రీచ్‌లు ఉన్నాయి. వీటిలో ఆచంట మండలం కరుగోరుమిల్లి ఓపెన్ రీచ్‌కు మాత్రమే పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు ఉన్నాయి. పెనుగొండ మండలంలో సిద్ధాంతం-1, నడిపూడి-1, నడిపూడి-2 రీచ్‌లకు కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు రావాల్సి ఉంది. సిద్ధాంతం-2, కోడేరు రీచ్‌లకు ఎలాంటి అనుమతులు రాలేదు. బోట్‌మ్యాన్ రీచ్‌లన్నింటికీ కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు రావాలి. ఈ ప్రక్రియ కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉంటుంది. వీలైనంత త్వరగా అనుమతులు వచ్చేలా ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. అనుమతులు రాగానే తవ్వకాలు చేపట్టి సామాన్యులకు ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తాం.




ఆన్‌లైన్‌లోనే బుకింగ్.. సాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టర్ ద్వారా ఆన్‌లైన్‌లో 24 గంటలూ ఇసుక కోసం నమోదు చేసుకోవచ్చు. స్టాకు యార్డుల వారీగా అందుబాటులో ఉన్న ఇసుక నిల్వలు, నాణ్యత గ్రేడ్‌లను ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. సమీప స్టాక్‌యార్డును ఎంచుకుని ఆన్‌లైన్‌లో బుకింగ్ ద్వారా ఆర్డర్ చేసుకుంటే ఇంటికే ఇసుక వస్తుంది. జిల్లాలోని స్టాకు యార్డుల్లో ప్రస్తుతం ఇసుక నిల్వలు లేకపోవడంతో తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల నుంచి సరఫరా చేస్తున్నాం. ఆన్‌లైన్ విధానంలో ఇసుక సరఫరాకు జిల్లాలో సుమారు 300 మంది లారీ యజమానులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

పట్టుబడితే జరిమానా.. పలు ప్రాంతాల్లో రాత్రి వేళ అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రత్యేక నిఘాతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం. ఇలాంటి వాహనాలు పట్టుబడితే నూతన నిబంధనల ప్రకారం రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తాం. అవసరమైతే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తాం.

పంపుహౌస్‌నే అందమైన వనంగా మలిచి!

పాలకోడేరు, న్యూస్‌టుడే: పంచాయతీ మంచినీటి చెరువుల పంపు హౌస్ ప్రదేశాలు దాదాపు అన్నీ చెట్ల తుప్పలు, గడ్డితో చిట్టడవులను తలపిస్తుంటాయి. పాలకోడేరులోని మంగయ్య చెరువు గట్టుపై ఉన్న పంపుహౌస్‌ను ఒక్కసారి తిలకిస్తే ఆశ్చర్యపోవడం ఖాయం. మంచినీటి ట్యాంకు, ఫిల్టర్‌బెడ్ల కంటే అందమైన పూలమొక్కలతో కనువిందు చేసే ఉద్యానం దర్శనమిస్తోంది. లోపలికి అడుగుపెట్టగానే రకరకాల పూల మొక్కలతో పాటు పలు రకాల పండ్లు, పచ్చటి మొక్కలు స్వాగతం పలుకుతాయి. ఈ అందమైన ఉద్యానానికి ఆద్యుడు పంపుహౌస్ కాపలాదారు ఆళ్ల రమణ. మొక్కల పెంపకం అంటే మక్కువ కలిగిన ఈ వృద్ధుడు అహర్నిశలూ ఇక్కడ వనం చేస్తూ అందమైన వనాన్ని నిర్మించి పచ్చటి మొక్కలను కాపాడుతున్నారు. నామమాత్రపు వేతనం తీసుకుంటూ సొంత ఖర్చుతో ఈ గార్డెన్ తీర్చిదిద్దారు. ఒకప్పుడు చిట్టడవిని తలపించే విధంగా ఉన్న ఈ ప్రాంతాన్ని ప్రస్తుతం ఆహ్లాదాన్ని పంచే పచ్చటి ఆవరణగా మార్చివేసిన మహేర్ గ్రామస్థులతో పాటు అధికారులు, ప్రకృతి ప్రేమికుల మన్ననలు పొందుతున్నారు. విధుల నిర్వహణలోనూ సమయపాలన పాటించడం ఈయన సొంతం.


గార్డెన్‌లో డ్రాగన్ మొక్కలు


ఆళ్ల రమణ


మంచినీటి పథకం వద్ద మొక్కలు

సేంద్రియ విధానంలో... గార్డెన్‌లోని పచ్చటి మొక్కలతో పాటు పండ్ల మొక్కలకు సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగిస్తున్నారు. నాలుగేళ్ల కిందట పాతిన చెరకు గడ 40 అడుగుల పొడవుగా పెరిగింది. డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలను సేంద్రియ ఎరువులతో పెంచుతున్నారు. ఇక ఆలస్యమెందుకు ఒకసారి వెళ్లి చూసి వచ్చేద్దాం.

అమ్మవారికి టన్నున్నర సారె తయారీ

నిడమర్రు, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రుల సందర్భంగా మండలపర్రులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో అమ్మవారికి టన్నున్నర సారెను భక్తుల విరాళాలతో తయారు చేస్తున్నారు. 11 రకాల మిఠాయిలను ఆదివారం నుంచి తయారు చేయడం ప్రారంభించారు. ఈ నెల 8న అమ్మ వారికి సారె సమర్పిస్తారు. అదే రోజు రూ.42 లక్షలతో తయారు చేయించిన బంగారు కిరీటాన్ని అమ్మవారికి అలంకరిస్తారు. ఈ సందర్భంగా కుంకుమ పూజలు నిర్వహిస్తామని పంచాయతన క్షేత్ర కమిటీ నిర్వాహకులు గాదిరాజు వెంకట సుబ్బరాజు, సరిపల్లె శంకరం, కె.రామచంద్ర రాజు, పి.కృష్ణంరాజు తెలిపారు. అమ్మవారికి సమర్పించిన సారెను భక్తులకు పంచిపెడతామన్నారు.




మండలపర్రులో మిఠాయిలు తయారు చేస్తున్న మహిళలు

ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించం


మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి (చిత్రంలో) ఎస్పీ, జేసీ

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇసుకను పూర్తి ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని నిర్వహణ, రవాణా రుసుములను మాత్రమే వినియోగదారులు భరించాలని కలెక్టర్ నాగరాణి తెలిపారు. ఎస్పీ నయీం అస్మితో కలిసి ఆమె ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో అయిదు డీసిల్టేషన్ కేంద్రాల్లో మూడు లక్షల టన్నులు, ఆరు ఓపెన్ రీచ్‌లలో 4.20 లక్షల టన్నులు ఇసుక సీఆర్‌జడ్ పరిధిలో ఉందని, ఆయా ప్రాంతాల్లో తవ్వకాలపై జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆంక్షలున్నాయని వెల్లడించారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని.. అనుమతులు వస్తే జిల్లాలో పూర్తిస్థాయిలో ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుతానికి పొరుగు జిల్లాల నుంచి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణదారులు ఇసుక కోసం https:///www.sand.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లోని సహాయ కేంద్రంలో ఆరుగురు సిబ్బంది అందుబాటులో ఉంటారని, 93914 45753, 86882 91997, 81869 39223, 95501 75144 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ నెల 16 నుంచి ఉచిత ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. పది చక్రాల లారీ ద్వారా 18, 20 టన్నుల ఇసుకను రూ.13,660కే పొందవచ్చన్నారు. అంతకు మించి ఎవరైనా వసూలు చేస్తే సహాయ కేంద్రం నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎస్పీ నయీంఅస్మి మాట్లాడుతూ ఎవరైనా ఇసుకను అక్రమంగా నిల్వ చేసినా, రవాణా చేసినా తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉచిత ఇసుక విషయంలో సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఇసుక రవాణాపై సంబంధిత అధికారులతో కలెక్టర్ దూరదృశ్య సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

అగ్నిమాపకశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఆనంద్ ఎన్నిక



నిడదవోలు, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అగ్నిమాపక సేవల శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా నిడదవోలు అగ్నిమాపక కేంద్రంలో పనిచేస్తున్న తమ్మినేని ఆనందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నిడదవోలు పట్టణంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా శ్రీను(నరసాపురం), కార్యదర్శిగా రమాకాంత్(పాలకొల్లు), సహాయ కార్యదర్శిగా నందగోపాల్(భీమవరం), కోశాధికారిగా రామాంజనేయులు(భీమడోలు), సలహాదారుగా శ్రీనివాస్(జంగారెడ్డిగూడెం), వెల్ఫేర్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు(నిడదవోలు), కార్యదర్శిగా రుద్ర నాగయ్య(తణుకు) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా మస్తాన్, రాజేష్‌లు వ్యవహరించారు. సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర, రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణ, రాష్ట్ర క్రీడా కార్యదర్శి సప్తగిరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కాపుల సంక్షేమానికి ఏటా రూ. వెయ్యి కోట్లు
మంత్రి నిమ్మల వెల్లడి


రామానాయుడును సత్కరిస్తున్న జస్టిస్ భవానీప్రసాద్, సమాఖ్య ప్రతినిధులు

గునుపూడి, న్యూస్‌టుడే: కాపుల సంక్షేమానికి సంబంధిత కార్పొరేషన్ ద్వారా ఏటా రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయిస్తానని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (కోపా) ఆధ్వర్యంలో కాపు సమ్మేళనం, జిల్లా సదస్సు, కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని భీమవరం బ్యాంకుకాలనీలో ఉన్న ఆ సంఘం భవనంలో ఆదివారం నిర్వహించారు. మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం కాపు కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వలేదని విమర్శించారు. కాపులతో పాటు అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా అయోధ్య రామాలయం ఆర్కిటెక్చర్ మండెల పాండురంగారావు దంపతులను ఆయన సత్కరించారు. అనంతరం హైదరాబాదుకు చెందిన విశ్వబలిజ, కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు సంఘాల సమాఖ్య సహకారంతో 70 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. సభకు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గంధం భవానీప్రసాద్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, సమాఖ్య కన్వీనర్ అల్లం నాగేశ్వరరావు, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు గంధం సత్యశేఖర్, ఆదాయపు పన్నుశాఖ పూర్వ కమిషనర్ పీవీ రావు, తెలగ కాపు ఐకాస అధ్యక్షుడు దాసరి రాము, భాజపా నాయకుడు ఆలపాటి లక్ష్మీనారాయణ, కరాటం రాంబాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, యిర్రింకి సూర్యరావు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, కోపా అధ్యక్షుడు యర్రంశెట్టి హరనాథ్‌రావు, కార్యదర్శి ఆరేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రామాంజనేయులుకు విరాళం అందిస్తున్న ఐఎంఏ భీమవరం శాఖ ప్రతినిధులు

రూ. 2.68 లక్షలు సాయం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భీమవరం శాఖ తరఫున రూ.2.68 లక్షల విరాళం ఎమ్మెల్యేకు ఆదివారం అందజేశారు. శంకర్‌కుమార్‌వర్మ, గొట్టుముక్కల బాలకృష్ణంరాజు, రమణరాజు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.


ఊచలు తేలి ప్రమాదకరంగా ఉన్న అగ్నిమాపక కేంద్రం


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై కట్టిన పరదాలు


పెచ్చులూడుతున్న కార్యాలయంలో ఉద్యోగి విధులు

శిథిల భవనాల్లో బిక్కు బిక్కు..!

నరసాపురంలోని సబ్‌రిజిస్ట్రార్, డివిజల్ ఉపఖజానా కార్యాలయం, అగ్నిమాపక కేంద్రం భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఊచలు తేలి, పెచ్చులూడుతున్న గదుల్లో బిక్కుబిక్కుమంటూ ఉద్యోగులు కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా నానిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రత్యామ్నాయ భవనాలను నిర్మించాలని గడిచిన వైకాపా ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు. **- ఈనాడు, నరసాపురం**

బాస్కెట్‌బాల్ విజేత చిత్తూరు జట్టు

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: ఏలూరు ఏఎస్‌ఆర్ మైదానంలో జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం, సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఆధ్వర్యంలో టి.మోహన్‌కుమార్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సెమీఫైనల్, అనంతరం ఫైనల్ పోటీలు నిర్వహించారు. సెమీఫైనల్‌లో రామచంద్రాపురం, విశాఖపట్నం జట్లు తలపడగా రామచంద్రాపురం, చిత్తూరు, గుంటూరు జట్లు తలపడగా చిత్తూరు జట్టు గెలుపొందాయి. తుది పోరులో రామచంద్రాపురం, చిత్తూరు జట్లు పోటీ పడగా చిత్తూరు జట్టు విజయం సాధించింది. రెండు, మూడు స్థానాల్లో రామచంద్రాపురం, గుంటూరు, విశాఖపట్నం జట్లు నిలిచాయి. ఆయా జట్లకు నగదు బహుమతులను ఏపీ పంచాయతీరాజ్ సెక్రటరీల సంఘం కార్యదర్శి కృష్ణారావు అందజేశారు.

రగ్బీ విజేత కర్నూలు

పెదవేగి, న్యూస్‌టుడే: పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో పెదవేగిలోని గురుకుల బాలుర పాఠశాల మైదానంలో అండర్-19 విభాగంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో కర్నూలు జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజులపాటు జరిగిన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల నుంచి 144 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. శ్రీకాకుళం, ప్రకాశం జిల్లాల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.జయరాజు ట్రోఫీలు అందజేశారు. అనంతరం జాతీయ స్థాయిలో త్వరలో జరిగే పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. పరిశీలకుడు కె.నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు, పీఈటీ గురుమూర్తి, వివిధ జిల్లాల పీఈటీలు పాల్గొన్నారు.

వేంకన్న కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు జరిగే ద్వారకాతిరుమల శ్రీవారి ఆశ్వయుజ మాస తిరుకల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఆలయానికి రంగులు వేసి సుందరీకరిస్తున్నారు. స్వామివారి కల్యాణ వైభవం తెలిసేలా క్షేత్రంలోని ప్రధాన కూడళ్లలో భారీ కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ నాలుగు గోపురాలు, ప్రాకారాలకు విద్యుద్దీప అలంకరణలు చేయనున్నారు.

లక్ష దాటిన భాజపా సభ్యత్వాలు

పాములపర్రు (ఉండి), న్యూస్‌టుడే: జిల్లాలో లక్షకు మించి భాజపా సభ్యత్వాలు నమోదైనట్లు ఆ పార్టీ జిల్లా ప్రముఖ్ కొవ్వూరి వెంకటరెడ్డి తెలిపారు. ఉండి మండలం పాములపర్రులో పార్టీ మండల అధ్యక్షుడు యర్రా విక్రమ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ఆదివారం సాయంత్రం పర్యవేక్షించి మాట్లాడారు. అక్టోబరు 15వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. పార్టీ నియోజకవర్గ సహ సమన్వయకర్త గాదిరాజు వెంకటేశ్వరరాజు, మండల ఉపాధ్యక్షులు కొమ్మన నాగ వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం
ఏడుగురు ప్రయాణికులకు గాయాలు


జగన్మోహనరావు (పాతచిత్రం)


దెబ్బతిన్న బస్సు

నరసాపురం, యలమంచిలి, కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట మండలం బయ్యవరం జాతీయ రహదారి వద్ద ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందగా ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. దీనికి సంబంధించి కశింకోట సీఐ స్వామినాయుడు కథనం ప్రకారం. . నరసాపురం నుంచి సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు 33 మంది ప్రయాణికులతో ఆదివారం రాత్రి విశాఖపట్నం బయల్దేరింది. బయ్యవరం జాతీయ రహదారి వద్ద లారీ యూటర్న్ అవుతుండగా దీని వెనక ఆగి ఉన్న మరో లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. యలమంచిలి మండలం ఇలపకుర్రు గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ గుత్తుల జగన్మోహనరావు (50) మృతి చెందారు. ఇతని పాటు ఏడుగురు ప్రయాణికులకు గాయాలవగా వీరికి అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందించారు. వీరిలో ఒక మహిళ కాలికి బలమైన గాయమైంది. ఈమెను బంధువుల చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి నాయుడు తెలిపారు.

జగన్మోహనరావు మృతితో విషాదం

జగన్మోహనరావు మృతితో నరసాపురం ఆర్టీసీ డిపో, ఆయన స్వగ్రామం యలమంచిలి మండలం ఇలపకుర్రులో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రమాద ఘటన సమాచారం అందిన వెంటనే ఆర్టీసీ నరసాపురం డిపో సహాయ మేనేజరు టి.ధనలక్ష్మి, యూనియన్ నాయకులు ఎన్.ఎస్.నారాయణ, జగన్మోహనరావు బంధువు ఎన్వీఎస్ నారాయణ మూర్తి అక్కడకు తరలివెళ్లారు. జగన్మోహనరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని ఆమె తెలిపారు.

డ్రగ్స్ ఉన్న పార్సిల్ వచ్చిందంటూ..
మహిళకు రూ.40 లక్షలకు టోకరా వేసిన సైబర్ కేటుగాళ్లు

నూజివీడు, న్యూస్‌టుడే: డ్రగ్స్ ఉన్న పార్సిల్ వచ్చిందంటూ ఓ మహిళకు సైబర్ కేటుగాళ్లు రూ.40 లక్షల టోకరా వేసిన ఘటన నూజివీడు పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నూజివీడు ఉషాబాల నగర్‌కు చెందిన మందపల్లి కమల జేసుదాసుకు ముగ్గురు సంతానం. అందరూ ఆమెకు దూరంగా నివసిస్తున్నారు. పెద్ద కుమార్తె బెంగళూరులో.. కుమారుడు, చిన్న కుమార్తె అమెరికాలో ఉంటారు. ఆమెకు ఈ నెల 2న ఒక ఫోన్ కాల్ వచ్చింది. తాము ముంబయి పోలీసు విభాగం నుంచి మాట్లాడుతున్నట్లు ఓ మహిళ తెలిపింది. మీకు ఒక పార్సిల్ వచ్చిందని దానిలో ఎండీఎంఏ, నిషేధిత డ్రగ్స్ ఉన్నాయని చెప్పారు. దానితో మీకు ఏమైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. అంతలో ఆమె మరో నంబర్ నుంచి వీడియో కాల్ చేశారు. తాను ముంబయి పోలీసు అధికారినని, మీకు డ్రగ్స్‌తో సంబంధం ఉందని భయపెట్టారు. డ్రగ్స్ ఇన్వెస్టిగేషన్‌కు సంబంధించి కొంత నగదు డిపాజిట్ చేయాలని, విచారణలో డ్రగ్స్‌తో సంబంధం లేదని తేలితే తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికింది.. దీంతో ఆమె ఈ నెల 3న రూ.20 లక్షలు ఒకసారి, మరొక ఖాతాకు రూ.10 లక్షలు బదిలీ చేశారు. ఈ నెల 4న మరొక ఖాతాకు రూ.10 లక్షలు ఇలా మొత్తం రూ.40 లక్షలు బదిలీ చేశారు. నగదు బదిలీ చేసిన తర్వాత నుంచి ఆమెతో మాట్లాడిన ఫోన్ నంబర్ పనిచేయడం ఆగిపోయింది. దీంతో ఆమె మోసపోయినట్లు గ్రహించి నూజివీడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నూజివీడు పట్టణ సీఐ పి.సత్యశ్రీనివాస్ ఆదివారం తెలిపారు.

తేనెటీగల దాడిలో కొబ్బరి తీత కార్మికుడి మృతి

ఆచంట(మార్టేరు), న్యూస్‌టుడే: గోదావరి తీర ప్రాంతంలో తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడి విజయనగరం జిల్లాకు చెందిన కొబ్బరి తీత కార్మికుడు మృతి చెందాడు. ఎస్సై వెంకటరమణ కథనం మేరకు. . ఆచంట మండలం అయోధ్య లంక పంచాయతీ మర్రిమూలలోని కొబ్బరితోటలో శనివారం కొబ్బరి దింపు చేస్తుండగా కార్మికుడు బాడితమాని రెల్లబాబు(49) ముఖం, ఇతర శరీర భాగాలపై తేనెటీగలు దాడి చేశాయి. అతన్ని సహచర కార్మికులు, స్థానికులు కోనసీమ జిల్లా పి.గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం చేయించారు. అక్కడి నుంచి అమలాపురం ఏరియా ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం రామవరం గ్రామానికి చెందిన రెల్లబాబు మరో ముగ్గురు కొబ్బరి దింపు పని నిమిత్తం 20 రోజుల క్రితం అయోధ్య లంక వచ్చారు. స్థానికుడైన కొప్పాడి సోమరాజు తోటలో పని చేస్తుండగా ఈ ఘటన చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై సహచర కార్మికుడు కండిబోయిన ఎర్రయ్య ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు

వేర్వేరు చోట్ల ప్రమాదాలు ఇద్దరి మృత్యువాత

పాలకొల్లు మార్కెట్, పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: వాహనం ఢీకొని మహిళ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం పాలకొల్లు మండలం బల్లిపాడు రహదారిపై జరిగింది. స్థానికుల కథనం ప్రకారం లంకలకోడేరు అల్లూరి సత్యనారాయణ కాలనీకి చెందిన కొత్తపల్లి విజయలక్ష్మి(33) ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఈమె పాలకొల్లు ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్నారు. విధులు ముగించుకుని సాయంత్రం భీమవరం వైపు నుంచి లంకలకోడేరు ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టింది. గతంలో భర్త సుబ్రహ్మణ్యం కూడా రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దే ఉంటుండగా, వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ప్రమాదంపై రూరల్ పోలీసులను సంప్రదించగా స్థానికుల నుంచి సమాచారం అందిందన్నారు.

ఆచంట(మార్టేరు), న్యూస్‌టుడే: ఆచంట మండలం వల్లూరు పెట్రోల్ బంకు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు స్థానిక మాదాసువారిపాలేనికి చెందిన దిగమర్తి లాజర్(49) పని నుంచి తిరిగి ఇంటికెళ్తున్న సందర్భంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన వాహనం ఢీకొంది. ఈ ఘటనలో లాజర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం నిమిత్తం పాలకొల్లు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించగా అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందారు. బాధితుడి కుమారుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమణ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

డబ్బు కోసమే మహిళ హత్య


పోలీసుల అదుపులో నిందితుడు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: హత్యకు గురైన మహిళ కేసును పట్టణ పోలీసులు ఛేదించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో వివరాలను ఏఎస్పీ భీమారావు వెల్లడించారు. స్థానిక గాంధీ బొమ్మ కూడలికి చెందిన దరబాల లోవరాజు బంటా మేస్త్రీగా పని చేస్తుంటారు. చెడు వ్యసనాల కారణంగా అప్పులపాలయ్యారు. ఇదే ప్రాంతానికి చెందిన ఒంటరి మహిళ బొబ్బిలిదేవి(52) వద్ద నగదు ఉండటాన్ని గుర్తించాడు. గత నెల 9న రాత్రి ఇంట్లోకి చొరబడి ఆమె మెడను టవల్‌తో చుట్టి, హత్య చేశారు. ఇంట్లో ఉన్న రూ.1.25 లక్షల నగదు, హతురాలి చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని తీసుకుని వెళ్లిపోయాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు.

భీమవరం

• భీమవరం • ఉండి



అంతరిక్ష వీక్షణం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను పురస్కరించుకొని భీమవరంలోని బీవీ రాజు విద్యాసంస్థల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అంతరిక్ష పరిశోధనలు, రాకెట్ నమూనాల ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు వచ్చి వీటిని ఆసక్తిగా తిలకిస్తూ విజయవంతమైన ప్రయోగాల వివరాలు తెలుసుకుంటున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ఎస్ కుమరేశ్వరన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. నూతన మద్యం విధానం, జిల్లాలోని అబ్కారీ స్టేషన్ల వివరాలు తదితర విషయాలపై ఇరువురు మాట్లాడుకున్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో విజేతలు వీరే..

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి అండర్-15 బాలురు, బాలికల చదరంగం పోటీలు ఆదివారం భీమవరంలో జరిగాయి. యశ్విత వర్మ(భీమవరం), పి. జోగిందర్(తాడేపల్లిగూడెం), పూజిత్ శరన్(భీమవరం), వెంకటకార్తికేయ(తాడేపల్లిగూడెం) విజేతలుగా నిలిచారు. బహుమతి ప్రదానోత్సవంలో తెదేపా రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి అందజేసినట్లు చదరంగం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం. కిశోర్ తెలిపారు.

పెర్కిపాలెంలో వైద్య శిబిరం

పెర్కిపాలెం (వీరవాసరం), న్యూస్‌టుడే: యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో పెర్కిపాలెం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే త్సవటపల్లి సత్యనారాయణమూర్తి (బాబ్జి) ప్రారంభించారు. 150 మందికి క్యాన్సర్ ప్రాథమిక, కంటి, దంత, చర్మ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేశారు. క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు, అధ్యక్షుడు జక్కంపూడి మదన్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర సంరక్షణపై అశ్రద్ధ వద్దు

దుంపగడప (ఆకివీడు), న్యూస్‌టుడే: ఆకివీడు ఆదర్శ, అభయ, గోల్డెన్ ఆక్వా లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో దుంపగడప గ్రామ సచివాలయం వద్ద ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి ఐడియల్ విజన్ ఆసుపత్రి (భీమవరం) వైద్యుడు పి.[illegible] తన్న నేత్ర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. 16 మందిని శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు. కంటి చూపులో ఇబ్బందులు వస్తే అలస్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని క్లబ్ సభ్యులు తెలిపారు.

కల్లుగీత రక్షణకు సమగ్ర చట్టం చేయాలి

నరసాపురం, న్యూస్‌టుడే: కల్లు గీత రక్షణకు ప్రభుత్వం సమగ్ర చట్టం చేసి అమలు చేయాలని ఆ సంఘ డివిజన్ అధ్యక్షుడు బొక్కా చంటి ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని మీరా స్మారక గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో చంటి అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన కల్లుగీత కార్మికుల కుటుంబాలకు బీమా ప్రామాణికం లేకుండా గతంలో మాదిరే పరిహారం అందించాలని ఆయన కోరారు. కల్లు గీత కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు కడలి పాండు, బొక్కా సోమేశ్వరరావు, బండి పోలేశ్వరరావు, గుబ్బల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వదిలేస్తే.. రూ.కోట్లు వృథా!



● వీరవాసరం మండలం అండలూరులో నిర్మాణ దశలో ఉన్న రైతు సేవా కేంద్రం ఇది. దాదాపు 80 శాతం పనులు రెండేళ్ల క్రితం పూర్తయ్యాయి. వైకాపా సర్కారు చివర్లో నిధులు విడుదల చేయకపోవడంతో ఈ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది.

వీరవాసరం, న్యూస్‌టుడే: గ్రామీణులకు మెరుగైన సేవలు అందిస్తామంటూ గత వైకాపా సర్కారు సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య శాలల పేరిట నూతన వ్యవస్థలను ప్రవేశపెట్టింది. వీటి పేరిట ప్రచారం హోరెత్తించిన ఆ పార్టీ నాయకులు దాదాపు అన్ని గ్రామాల్లో నూతన భవన నిర్మాణాలు ప్రారంభించారు. తరువాత నిధుల విడుదలలో జాప్యం కారణంగా చాలా చోట్ల ఈ పనులు అర్ధాంతరం నిలిచిపోయాయి. కొన్ని 50 నుంచి 80 శాతం పూర్తికాగా.. మరికొన్ని పునాది దశలోనే ఆగిపోయాయి.

ఏ పల్లెలో చూసినా అసంపూర్తి నిర్మాణాలే

ప్రస్తుత ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి ప్రజలకు సేవలు చేరువ చేయాలని పలువురు కోరుతున్నారు. లేని పక్షంలో రూ. వ్యయంతో చేపట్టిన నిర్మాణాలు నిరుపయోగమయ్యే ప్రమాదముందని చెబుతున్నారు.



● మండల కేంద్రమైన వీరవాసరంలో రూ. 40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణం పునాది దశ దాట లేదు. దాతలు సమకూర్చిన స్థలంలో ఈ పనులు ప్రారంభించారు. గుత్తేదారుకు సకాలంలో బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు నిలిపేశారు.

రెండు నియోజకవర్గాల్లో భవనాల స్థితి ఇలా..

భవనం	మంజూరు	పూర్తయినవి	అసంపూర్తి
సచివాలయాలు	113	93	20
ఆర్బీకేలు	113	76	37
హెల్త్ క్లీనిక్‌లు	88	38	50

ఇదీ పరిస్థితి.. భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో 314 సచివాలయ, రైతు సేవ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టగా 207 దాదాపు కొలిక్కి వచ్చాయి. మిగిలిన 107 వివిధ దశల్లో ఉన్నాయి. పలుచోట్ల పునాదుల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి నిర్మాణాల నాణ్యతను దెబ్బతీస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి

అసంపూర్తి నిర్మాణాల అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతానికి 80 శాతం వరకు పూర్తయిన భవనాలను పూర్తి చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

- జి. స్వామినాయుడు, పంచాయతీరాజ్ డీఈ

తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలా..?

రేపు డయల్ యువర్ కమిషనర్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణ పరిధిలో మీరు నివసించే ప్రాంతంలో పైపులైన్ల మరమ్మతులు, నీటి సరఫరాలో అవరోధాలు, పారిశుద్ధ్య లోపాలు, ఇంటింటా చెత్త సేకరణ ఇబ్బందులు ఉన్నాయా? ఇలాంటి సమస్యలను 'ఈనాడు- 'ఫోన్ ఇన్' ద్వారా మీరు నేరుగా పురపాలక కమిషనర్ దృష్టికి తీసుకెళ్లవచ్చు. సంబంధిత అంశాలపై కమిషనర్ కె.రామచంద్రారెడ్డి సమాధానం ఇవ్వడంతో పాటు పరిష్కార చర్యలు చేపడతారు. వ్యక్తిగత అంశాలను ప్రస్తావించవద్దు.

తేదీ, సమయం	ఫోన్ చేయాల్సిన నంబరు
అక్టోబరు 8 (మంగళవారం), ఉదయం 10 నుంచి 11 గంటల వరకు	80085 74471

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

సమస్య : భీమవరంలోని పలు ప్రాంతాల్లో చెత్త వేసేందుకు ఏర్పాటు చేసిన డబ్బాలు పాడైపోయాయి. రహదారులకు పక్కన వాటిని వదిలేశారు. **- ఆశీ, ప్రైవేటు ఉద్యోగి**

సమస్య : భీమవరం రైల్వే దిగువ వంతెన మార్గాల్లో మురుగు ఉంది. ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. **- సురేశ్‌కుమార్, ప్రైవేటు ఉద్యోగి**

సమాధానం : పాడైపోయిన డబ్బాలను సేకరించి ఓ చోట చేరుస్తాం. రైల్వే దిగువ వంతెనల్లో మురుగు లేకుండా చర్యలు తీసుకుంటా. **- సీహెచ్ వెంకటేశ్వరరావు, సహాయ కమిషనర్**

ఉండి, న్యూస్‌టుడే

సమస్య : ఉండిలో మహంకాళమ్మ చెరువు ఇన్‌లెట్ మూతపడింది. చెరువులోని నిల్వ నీటిని సకాలంలో తోడటంలేదు. కుళాయిల ద్వారా కలుషిత జలాలు వస్తున్నాయి. **- కె.సుబ్బలక్ష్మి, ఉండి**

సమాధానం: చెరువు నీటిని అవసరమైన సమయాల్లో బయటకు తోడిస్తున్నాం. గట్లను ఇటీవలే శుభ్రం చేయించాం. మరోసారి పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. **- గోపాలకృష్ణ, కార్యదర్శి**

సమస్య : ఉండి- గణపవరం రహదారి వివిధ చోట్ల ఛిద్రంగా తయారైంది. కోలమూరు, పాములపర్రు, ఆరేడు ప్రాంతాల్లో ప్రమాదాల బారిన పడుతున్నాం. **- ఐ.సుధీర్‌కుమార్, కోలమూరు**

సమాధానం: రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించాం. ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. **- కె.శ్రీహరిరాజు, ఆర్అండ్‌బీ ఏఈ**

కనీస వసతులు లేక అవస్థలు



చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేరు గ్రామంలో అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బి. వాసుదేవరావు డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకుడు అప్పలనాయుడు అధ్యక్షతన ఆదివారం సీపీఎం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ భీమవరం పట్టణానికి ఆనుకుని ఉన్న తాడేరు గ్రామంలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రామంలో తాగునీటి సరఫరా సక్రమంగా లేదన్నారు. తాగునీటి పథకాలు మరమ్మతులకు గురి కావడంతో ప్రజలు తాగునీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. సీపీఎం జిల్లా నాయకుడు ఎం. వైకుంఠరావు మాట్లాడుతూ వివిధ గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. అంతకుముందు సీతారాం ఏచూరి, ఆర్. సత్యనారాయణరాజు చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాసభ కార్యదర్శిగా గొండు జనార్దనరావు, కమిటీ సభ్యులుగా శీలబోయిన భద్రం, ఎస్. అప్పలనాయుడు, జి. రాము తదితరులను ఎన్నిక చేశారు.

అపూర్వం.. ఆత్మీయం



వేదికపై పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల మండలం జువ్వలపాలెం ఉన్నత పాఠశాలలో చదివిన 2007-2008 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడి వాతావరణంలో జరిగింది. 15 ఏళ్ల తర్వాత కలుసుకున్న బాల్యమిత్రులంతా ఆత్మీయ పలకరింపులతో.. యోగక్షేమాలు తెలుసుకుంటూ చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం అందించాలని నిర్ణయించారు. అనంతరం తమ గురువులు రామకృష్ణ, శ్రీనివాసరాజు, వరలక్ష్మి, పుష్పలత, సీతాదేవి, జ్యోతిలను ఘనంగా సత్కరించారు.

భాజపా బలోపేతానికి కృషి

నందమూరుగరువు (వీరవాసరం), న్యూస్‌టుడే: వీరవాసరం మండలంలో భాజపాను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కోశాధికారి కురెళ్ల నరసింహారావు పేర్కొన్నారు. నందమూరుగరువులో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు కోడి నరసింహ, జిల్లా కార్యదర్శి ఆకుల లీలాకృష్ణ, నాయకులు కొల్లి వెంకటరావు, వేంద్ర దివాకర్, మద్దాల శివాజీ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

యూత్ హాస్టల్స్ వార్షికోత్సవాలపై తీర్మానం

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ భీమవరం శాఖ వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహించాలని కన్వీనర్ గన్నాబత్తుల శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో తీర్మానం చేశారు. డిసెంబరు 14, 15 తేదీల్లో భీమవరంలోని ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పరిసరాల శుభ్రత, కాలుష్య నియంత్రణ, విజ్ఞాన యాత్రలు, ఎకో టూరిజం అంశాల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గట్టుపై.. చెత్త గుట్టలు



జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలో సేకరించిన వ్యర్థాలను యనమదుర్రు కాలువ గట్టుకు ఇరువైపులా గుట్టలుగా పోస్తున్నారు. అవి క్రమేణా డ్రెయిన్లో కలుస్తున్నాయని, దుర్వాసన, దోమల బెడదతో నరకం అనుభవిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డుకు యార్డుకు స్థలం కేటాయించి దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపాలని పట్టణ వాసులు కోరుతున్నారు. **-ఈనాడు, భీమవరం**

తీరనున్న తాగునీటి కష్టాలు

ఆకివీడుకు అమృత్ నిధులు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు నగర పంచాయతీ వాసులను ఏళ్ల తరబడి తాగునీటి సమస్య వెంటాడుతోంది. పాలకాలం నాటి పైపులైన్లు పలు చోట్ల దెబ్బతినడంతో తరచూ సరఫరాకు అవరోధాలు ఎదురవుతున్నాయి. శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదు. శిథిలావస్థకు చేరిన పంపు హౌస్‌లు, నిర్వహణ లేని ఓహెచ్‌ఆర్ఎస్ ట్యాంకులు, సంపులు, పరికరాలతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపేలా ప్రభుత్వం అమృత్ నిధులు రూ. 32 కోట్లు మంజూరు చేసింది.



పట్టణంలో తాగునీటి ట్యాంకు

40 కి.మీ. మేర కొత్త పైపులైన్లు

ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఈ పనులు ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. దీనిలో భాగంగా సుమారు 40 కిలోమీటర్ల మేర కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయనున్నారు. శుద్ధి కేంద్రంతో పాటు అవసరాన్ని బట్టి ఓహెచ్ ఆర్ఎస్ ట్యాంకులు, సంపులు నిర్మించనున్నారు. ఈ పనులు పూర్తయితే ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు.

త్రినయనీ.. శక్తి స్వరూపిణీ



ఉండి రాజులపేటలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

భీమవరం ఆధ్యాత్మికం, కాళ్ల, ఆకివీడు, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భీమవరం, ఆకివీడు పట్టణాలతో పాటు అన్ని గ్రామాల్లోని ఆలయాలు, ఉత్సవ మండపాల్లో అమ్మవారిని ఆదివారం లలితాదేవి, సంతానలక్ష్మి రూపంలో అలంకరించి కుంకుమపూజలు నిర్వహించారు. కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయ మండపంలో మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవమూర్తిని సంతానలక్ష్మి రూపంలో అలంకరించి భక్తులతో సహస్రనామ కుంకుమ పూజలు చేయించారు.

● భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మను అన్నపూర్ణ రూపంలో అలంకరించారు. ఆలయ కళావేదికపై చండీ హోమం, లక్ష కుంకుమార్చనలను భక్తులతో సామూహికంగా చేయించారు. సాయంత్రం అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన వందన కూడిపూడి, జానపద నృత్య అకాడమీ చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాత్రి ఆధ్యాత్మిక ప్రవచనం అనంతరం అభినయ నాట్య అకాడమీ (విజయవాడ) బృందం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు.

ఉండి, న్యూస్‌టుడే: ఉండి రాజులపేటలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ లలిత త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చారు.

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం 24వ వార్డు పరిధి గంగానమ్మ ఆలయ సమీపాన కాలనీ సంఘం ఆధ్వర్యంలో 108 కలశాలతో ఆదివారం ఊరేగింపు నిర్వహించారు.



ఆకివీడు: లలితా మాత రూపంలో..



కాళ్లకూరు: సంతానలక్ష్మి అలంకరణలో అమ్మవారు



చినకాపవరం: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



భీమవరం 24వ వార్డులో కలశాలతో ఊరేగింపు



మావుళ్లమ్మ ఆలయ కళావేదికపై చిన్నారుల నృత్య ప్రదర్శన

ఘన వ్యర్థాల కేంద్రానికి మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

లోసరి (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం అధ్వానంగా మారిన తీరుపై ఈ నెల 4న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పర్యవేక్షణలో కూలీలు శనివారం ఈ కేంద్రాన్ని శుభ్రం చేసి మరమ్మతులు చేశారు. దీనిని త్వరలోనే వినియోగంలోకి తెస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలి

నరసాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇసుక దోపిడీ అరికట్టి ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని సీపీఎం నాయకులు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణం పాత బజారు ప్రాంతంలో సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ఆదివారం నిరసన ప్రదర్శన చేశారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	దేవర
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	సత్యం సుందరం
నటరాజ్	రామ్‌నగర్ బన్నీ
కిషోర్ స్క్రీన్ 1	మత్తువదలరా 2
కిషోర్ స్క్రీన్ 2	దక్షిణ
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	స్వాగ్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	దేవర
విజయలక్ష్మి స్క్రీన్ 1	స్వాగ్
మహాలక్ష్మి స్క్రీన్ 2	కాళి

పొంచి ఉన్న ప్రమాదం

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల మండలంలో ప్రధాన రహదారి వెంబడి పలు గ్రామాల్లో 11 కేవీ విద్యుత్తు లైన్లు, స్తంభాలకు పాదులు అల్లుకుని ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పరివర్తకాల వద్ద, స్తంభాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వీటి వల్ల తరచూ విద్యుత్తు అంతరాయలు తలెత్తుతున్నాయని స్థానిక నివాసితులు వాపోతున్నారు. ఈ అంశంపై విద్యుత్తు ఏఈ రాంబాబు స్పందిస్తూ ఆయా ప్రాంతాలను పరిశీలించి స్తంభాలకు అల్లుకున్న పాదులు తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.



కాళ్లకూరు వేంకన్న ఆలయ సమీపాన..

భయపెడుతున్న శిథిల వంతెన



దొంగపిండి (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం దొంగపిండి గ్రామంలోకి రాకపోకలు సాగించే ప్రధాన మార్గంలో మురుగుకాలువపై ఉన్న ఈ వంతెన శిథిలస్థితికి చేరి చాలా కాలమైంది. దీని స్థానంలో కొత్తది నిర్మించాలని పదిహేనేళ్లగా ప్రజలు కోరుతున్నా ఆచరణలోకి రాలేదు. ప్రభుత్వాలు మారుతున్నా వీరి మొర ఎవరూ ఆలకించ లేదు. అనుకోని ఘటన జరిగి వంతెన కూలితే ఈ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. గ్రామ సమీపాన ఉన్న ఉప్పుటేరు మీదుగా పడవలపై, లేదా ఆక్వా చెరువు గట్ల వెంబడి కొంత వరకు రాకపోకలు సాగించగలరు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రజలు కోరుతున్నారు.

కార్మికుడి మృతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం కొత్తబస్టాండ్ వద్ద సైకిల్‌స్టాండ్‌లో పనిచేస్తున్న కార్మికుడు అనారోగ్య కారణాలతో ఆదివారం మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. అతడిని కడప జిల్లావాసిగా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

12 మంది జూదరుల అరెస్టు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి నర్సయ్య అగ్రహారంలో జూద స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేసి 12 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 10,430 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.నాగరాజు తెలిపారు.

అత్యవసర పనులపై నిర్లక్ష్యం!

అయిదేళ్ల కిందటే కూలిన ట్రఫ్ అక్విడక్టు



రామాపురంలో అక్విడక్టు నిర్మించాల్సిన ప్రాంతం

ఉండి, న్యూస్‌టుడే: జలవనరుల శాఖ పరిధిలో చేపట్టాల్సిన పనులపై గత ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యంతో పలు ప్రాంతాలకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామాపురం వద్ద పాములపర్రు పంట కాలువ, తెల్లికోడు డ్రెయిన్ కలిసేచోట ట్రఫ్ అక్విడక్టు దాదాపు అయిదేళ్ల కిందట కూలిపోయింది. దీనిని అత్యవసరంగా పునర్నిర్మించాల్సి ఉన్నా గత పాలకులు పట్టించుకోలేదు.

తాత్కాలిక పనులతో సరి..

రామాపురంలో ట్రఫ్ అక్విడక్టు కూలిన ప్రాంతంలో తెల్లికోడు డ్రెయిన్‌పై తూరలు పెట్టి పాములపర్రు పంట కాలువకు సాగునీరు వెళ్లేలా కొన్నాళ్ల కిందట తాత్కాలిక పనులు చేశారు. తూరలకు ఇరువైపులా మట్టి బస్తాలను రక్షణగా ఉంచారు. తూరల నుంచి వచ్చే నీటినే పాములపర్రు చెరువులో నింపి శుద్ధి చేసిన తర్వాత కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ తూరల్లోకి మురుగు వెళ్లకుండా ఇరువైపులా తాత్కాలిక పనులు చేశారు. వర్షాలు కురిసినప్పుడు ఇక్కడ సాగు, మురుగునీరు ఏకమై జలాలు కలుషితమవుతున్నాయి. ఈ సమస్యను ఇటీవల ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఆయన స్పందించి తక్షణం అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో జలవనరుల శాఖ డీఈఈ సత్యనారాయణమూర్తి, ఏఈ ఫణిశంకర్, ఎంపీడీవో ఎస్. రవీంద్ర, ఈవోపీఆర్డీ రామకృష్ణారెడ్డి, స్థానిక అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.



కోతకు గురైన బొండాడ కాలువ గట్టు

ప్రతిపాదనలు సిద్ధం

ఇక్కడ అక్విడక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని జలవనరుల శాఖ ఏఈ ఫణిశంకర్ తెలిపారు. రబీ సీజన్ ప్రారంభానికి ముందే ఈ పనులు చేపడతామని చెప్పారు. తెల్లికోడు డ్రెయిన్‌పై బాక్స్ కల్వర్టు నిర్మించి పైనుంచి పాములపర్రు పంట కాలువ నీరు ప్రవహించేలా ఇరువైపులా గోడలు నిర్మించాల్సి ఉందన్నారు. కోతకు గురైన బొండాడ డ్రెయిన్ గట్టును పటిష్ఠపరిచే పనులు కూడా ఇదే సమయంలో పూర్తి చేస్తామని వివరించారు.

చూడచక్కని బడి

దాతల చేయూతతో సౌకర్యాలు

విస్సాకోడేరు (పాలకోడేరు), న్యూస్‌టుడే: దాతల సహకారం.. ఉపాధ్యాయుల చొరవ, ప్రభుత్వ నిధుల సద్వినియోగం ఫలితంగా విస్సాకోడేరులోని కంచరదిబ్బ ప్రాథమిక పాఠశాల కొత్త రూపు సంతరించుకొంది. గతంలో ప్రహరీ కూడా లేకుండా పశువుల సంచారంతో అస్తవ్యస్తంగా ఈ పాఠశాల ప్రాంగణం ఉండేది. ప్రధానోపాధ్యాయిని షేక్ మస్తాన్‌బీ కృషితో ఇప్పుడు జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా రూపుదిద్దుకుంది. ప్రభుత్వ నిధులకు తోడు పలువురు దాతలు కూడా ముందుకు రావడంతో విద్యార్థులకు అవసరమయ్యే పలు సౌకర్యాలు సమకూరాయి.

ఆహ్లాదం నడుమ.. పాఠశాల ఆవరణలోకి అడుగు పెట్టగానే పచ్చటి మొక్కలు స్వాగతం పలుకుతాయి. విద్యార్థులను ఆకట్టుకునే విధంగా పాఠశాల బయట, తరగతి గదుల్లో పాఠ్యాంశాలకు సంబంధించిన రంగు రంగుల చిత్రాలను చూడవచ్చు. ఆట వస్తువులు కూడా అందుబాటులో ఉన్నాయి. స్థానికులు కూడా పాఠశాల అభివృద్ధికి తమ వంతు చేయూత నివ్వడంతో పాటు తమ పిల్లలను ఇక్కడే చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



ఆవరణలో తీర్చిదిద్దిన వనం

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలి



నరసాపురం: ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

నరసాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇసుక దోపిడీ అరికట్టి ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని సీపీఎం నాయకులు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. పట్టణం పాత బజారు ప్రాంతంలో సీపీఎం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ఆదివారం నిరసన ప్రదర్శన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తున్నా ఇచ్చిన హామీ మేరకు నేటికీ ఉచిత ఇసుక అందించలేదని విమర్శించారు. ర్యాంపుల వద్దే ఉచిత ఇసుక అందించాలని ప్రభుత్వాని కోరారు. కార్యక్రమంలో పోతినీడి రామకృష్ణ, అడబాల ప్రకాశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంటి

కల్లుగీత రక్షణకు సమగ్ర చట్టం చేయాలి

నరసాపురం, న్యూస్‌టుడే: కల్లు గీత రక్షణకు ప్రభుత్వం సమగ్ర చట్టం చేసి అమలు చేయాలని ఆ సంఘ డివిజన్ అధ్యక్షుడు బొక్కా చంటి ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని మీరా స్మారక గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన ఆ సంఘ సమావేశానికి చంటి అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన కల్లుగీత కార్మికుల కుటుంబాలకు బీమా ప్రామాణికం లేకుండా గతంలో మాదిరే పరిహారం అందించాలని ఆయన కోరారు. కల్లు గీత కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు కడలి పాండు, బొక్కా సోమేశ్వరరావు, బండి పోలేశ్వరరావు, గుబ్బల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి



నీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ రక్షత మంచినీటి పథక నిర్వహణ సిబ్బందిని ఆదేశించారు. ఛైర్‌పర్సన్ ఆదివారం పంపు హౌస్‌లో సీఐ వాల్వుల ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట పథకం పర్యవేక్షణ కమిటీ సభ్యులు ఉన్నారు.

పెనుగొండ మండలం ములపర్రులో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రం శిథిల స్థితికి చేరుతోంది. ఇందులో నిర్మించిన తొట్టెలు పాడవుతున్నాయి. మందు బాబులకు అడ్డాగా మారింది. సిబ్బంది కొరతతో గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సాగక ఎక్కడికక్కడే చెత్త కుప్పలతో వీధులన్నీ కంపు కొడుతున్నాయి. స్వచ్ఛ కార్యక్రమాలు సైతం మండలంలో నామమాత్రంగా నిర్వహించారు.



సంపద లేదు...
చెత్తే మిగిలింది

కేంద్రాలను నిరుపయోగంగా మార్చిన గత ప్రభుత్వం...

★ పెనుమంట్ర మండలం పొలమూరులో రూ.తొమ్మిది లక్షలతో సంపద కేంద్రం ఏర్పాటు చేయగా, రూ.10 లక్షలతో యంత్రాలకు సమకూర్చారు. ఇవన్నీ నిరుపయోగంగా మారాయి. గ్రామంలో చెత్త సేకరణకు ప్రైవేటు ఏజెన్సీకి నెలకు రూ.1.20 లక్షలు చెల్లిస్తున్నా పారిశుద్ధ్యం ఏ మాత్రం మెరుగుపడలేదు. ఏడాది క్రితం ప్రారంభమైన ఈ ప్రక్రియలో ఎటువంటి ఒప్పందం లేకుండానే చెల్లింపులు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



పోడూరు, మార్టేరు, పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే : రూ.లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. 2014లో అప్పటి తెదేపా ప్రభుత్వం వీటి నిర్మాణం చేసింది. గ్రామాల్లో సేకరించిన చెత్త వ్యర్థాల నుంచి వర్మీ కంపోస్టు ఎరువు తయారీ చేయాలన్నది ప్రధాన ఆలోచన. దీని ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరడంతో పాటు చెత్త సమస్య తీరుతుందని అంతా భావించారు. ఇందుకు గ్రామాల వారీ సిబ్బందిని నియమించారు. ప్రభుత్వం చెత్త రిక్షాలు అందజేసింది. ఈ క్రమంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటిని గాలికి వదిలేసింది.

అసలు వదిలేసి... గత ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో హడావుడి చేసింది. ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురాకుండా ఇంటింటా ప్లాస్టిక్ తొట్టెలు, పంచాయతీలకు రెండు, మూడు రిక్షాలను అందజేసింది. ఈ ఒక్కొక్క రిక్షా ఖరీదే రూ.24 వేలు. వీటిలో అధిక శాతం వినియోగించకుండా మూలన పెట్టడంతో పూర్తిగా పాడయ్యాయి. ఆచంట నియోజకవర్గంలో ఈ కేంద్రాల నిర్మాణానికి ఏకంగా రూ.2.68 కోట్లు వెచ్చించారు. తెదేపా ప్రభుత్వం నిర్మించిందనే కారణంతో వీటిని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. డీపీవో అరుణశ్రీ మాట్లాడుతూ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చే దిశగా చర్యలు చేపడతామని చెప్పారు.

10 AM to 1 PM
మేమున్నాం.. మీకు తోడుగా..
నరసాపురం: 80085 74504
పాలకొల్లు: 80085 74510
ఆచంట : 91212 29087

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే

సమస్య: కొత్త బ్యాంక్ కాలనీ ఎస్.ఎస్.ఎన్. ప్రాథమిక పాఠశాలకు ఆనుకొని చెత్త, వ్యర్థాలు వేస్తున్నారు. దీని కారణంగా చెత్త రహదారిపైకి వచ్చి అధ్వానంగా ఉంటుంది.
- విజయ్, కొత్త బ్యాంకు కాలనీ

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- దావీదురాజు, పారిశుద్ధ్య అధికారి

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: సిద్ధాంతం హైస్కూల్ సమీపంలో రహదారి చెంతన చెత్త వేస్తున్నారు. గాలికి అది ఎగిరి ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోంది. దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.
- నారాయణరావు, సిద్ధాంతం

సమాధానం: పరిశీలించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తాం
- అచ్యుత రామకృష్ణ, ఇన్‌ఛార్జి కార్యదర్శి

పెనుగొండ, న్యూస్‌టుడే

సమస్య: పెనుగొండ సంత మార్కెట్ ఆవరణలో చెత్త పేరుకుపోయింది. దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి.
- పి.సత్యనారాయణ, పెనుగొండ

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తొలగింపజేస్తాం.
- టి.రత్నాకరరావు, పంచాయతీ కార్యదర్శి

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

నరసాపురం, న్యూస్‌టుడే: పోక్సో కేసులో నిందితుడిని ఆదివారం అరెస్టు చేశామని ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. పట్టణానికి చెందిన బాలిక(10)తో యలమంచిలి మండలం మేడపాడు గ్రామానికి చెందిన ముద్దల శివప్రసాద్(32) ఈ నెల 5న అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై ఆ బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండు విధించినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై ఆదివారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. మాధవాయిపాలేనికి చెందిన తంబు కృష్ణ వర్మ(32) ఇటీవల అప్పుల పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 8న పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై ఆయన భార్య జ్ఞానేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే నాయకర్ దంపతులను సన్మానిస్తున్న యాజమాన్యం

నరసాపురం, న్యూస్‌టుడే: ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ హామీ ఇచ్చారు. పట్టణంలోని అంధుల పాఠశాల ఆవరణలో ఉన్న లూథరన్ చర్చిని ఆయన ఆదివారం సందర్శించారు. నాయకర్, ఆయన భార్య సునీతలకు చర్చి యాజమాన్య సభ్యులు ఆత్మీయ సత్కారం చేసి జ్ఞాపిక అందించారు. ఆయా కార్యక్రమాల్లో కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, బందెల రవీంద్ర, తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదుకు స్పందన



మాట్లాడుతున్న తాతాజీ

పెనుమంట్ర, న్యూస్‌టుడే: ఆరేళ్లకోసారి చేపట్టే భాజపా సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ తెలిపారు. మండలంలోని పొలమూరు ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. పెనుమంట్ర మండలంలో 10 వేలకు పైగా సభ్యత్వ నమోదు లక్ష్యమని చెప్పారు. తెదేపా గ్రామ అధ్యక్షుడు పెన్మెత్స వివేక్‌రాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి చింతపల్లి రామకృష్ణతో పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో సమస్యలు చక్కదిద్దుతాం

ఈఈ మధుకుమార్

మార్టేరు, న్యూస్‌టుడే: మార్టేరు విద్యుత్తు ఉప కేంద్రంలో పాడైన పీటీఆర్ స్థానంలో మరొకటి ఏర్పాటు చేసి సరఫరాలో సమస్యలను చక్కదిద్దనున్నట్లు నరసాపురం ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. 'ఈనాడు'లో 'బాబోయ్ కరెంటు కష్టాలు' శీర్షికతో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 8న మార్టేరు ఉప కేంద్రంలో 5ఎంవీఏ సామర్థ్యం గల పీటీఆర్ పని చేయడం లేదన్నారు. దీంతో కొన్ని ఫీడర్లకు ప్రత్యామ్నాయంగా ఆలమూరు ఉప కేంద్రం నుంచి వచ్చే ఫీడర్లతో అనుసంధానం చేసినట్లు చెప్పారు. ఈ నెల 4న ఆలమూరు ఫీడర్‌పై అధిక లోడు పడటంతో ట్రిప్పై సరఫరాలో అంతరాయం కలిగిందన్నారు. దీనిని తమ సిబ్బంది త్వరితగతిన సరిదిద్దినట్లు తెలిపారు. మార్టేరులో పీటీఆర్ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే ఈ సమస్య తీరుతుందన్నారు. ఆ శాఖ ఎస్ఈ ఎ.రఘునందన బాబు ఏడీఏ కె.రాంబాబుతో చరవాణిలో మాట్లాడి క్షేత్ర స్థాయిలో పరిస్థితిపై ఆరా తీశారు. వినియోగదారులు ఇబ్బంది పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈఈ వెంట పెనుగొండ ఏడీఏ కె.రాంబాబు, పెనుమంట్ర ఇన్‌ఛార్జి ఏఈ జి.నాగరాజు తదితరులు ఉన్నారు.

ఈనాడు కథనానికి స్పందన

చెత్త తొలగింపు

పెనుగొండ, న్యూస్‌టుడే: వడలి - పిట్టల వేమవరం ఆర్ అండ్ బీ రహదారిలో వడలి శివారు ఇటుకల బట్టీ సమీపంలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లు తోందని 'ముక్కు మూయాల్సిందే' శీర్షికతో ఈ నెల 6న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి వడలి సర్పంచి కాసాని విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డిలు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బంది జేసీబీతో చెత్తను తొలగించారు. ఆదివారం సెలవైనా అధికారులు చర్యలు చేపట్టి చెత్తను తొలగించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

పథకాలు అమలు చేసి ఆదుకోండి

పెనుమంట్ర, న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణ, రజక, చిరు వ్యాపారులు, ఆటో కార్మికులు, ఇతర వర్గాల వారికి లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం పథకాలను అమలు చేసి ఆదుకోవాలని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లాడ సూర్య భాస్కరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మార్టేరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వడం లేదన్నారు. పథకాలను అమలు చేయాలంటూ 21న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేయనున్నట్లు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీల్లో విజేతలు వీరే..

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి అండర్-15 బాలురు, బాలికల చదరంగం పోటీలు ఆదివారం జరిగాయి. యశ్వితవర్మ(భీమవరం), పి.జోగిందర్(తాడేపల్లిగూడెం, పూజిత్ శరన్(భీమవరం), వెంకటకార్తికేయ(తాడేపల్లిగూడెం) విజేతలుగా నిలిచారు. బహుమతి ప్రదానోత్సవంలో తెదేపా రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి అందజేసినట్లు చదరంగం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.కిశోర్ తెలిపారు.

బిడ్డలు చూడక పోతే ఫిర్యాదు చేయొచ్చు



మాట్లాడుతున్న రంగారావు

నరసాపురం, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలపై ఉందని, వారు చూడకుంటే మండల రెవెన్యూ, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చని నరసాపురం సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అందె రంగారావు సూచించారు. అల్లూరి సాంస్కృతిక కేంద్ర భవనంలో ఆదివారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. వృద్ధులకు ప్రభుత్వం అందజేస్తున్న సేవలు వివరించారు. వృద్ధుల సంక్షేమానికి విశిష్ట సేవలు అందించిన డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణరావు, బండారు ప్రతాప్ నాయుడు, వయోవృద్ధుల అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్, కార్యదర్శి షేక్ శిలార సాహెబ్, జి.జేసుప్రసాద్ బాబు, ఐ.సూర్యనారాయణరాజు, కె.గంగాధరరావు, కేవీఎస్ సరస్వతి రావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ బి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి

మార్టేరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని సీపీఎం మండలం కార్యదర్శి కె.సుబ్బరాజు ఒక ప్రకటనలో హెచ్చరించారు. బిల్లులు చెల్లించకపోతే సరఫరా నిలిపివేసే విద్యుత్తు శాఖ వినియోగదారులకు ఎందుకు నాణ్యమైన విద్యుత్తు అందించలేక పోతోందని ప్రశ్నించారు. రాత్రి సమయంలో పంకాలు తిరగడం లేదని దీంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో రామకృష్ణం రాజు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో విజేతలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి అండర్-15 బాలురు, బాలికల చదరంగం పోటీలు ఆదివారం జరిగాయి. యశ్వితవర్మ(భీమవరం), పి.జోగిందర్(తాడేపల్లిగూడెం, పూజిత్ శరన్(భీమవరం), వెంకటకార్తికేయ(తాడేపల్లిగూడెం) విజేతలుగా నిలిచారు. బహుమతి ప్రదానోత్సవంలో తెదేపా రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి అందజేసినట్లు చదరంగం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.కిశోర్ తెలిపారు.



క్షీరారామంలో మహాలక్ష్మీదేవిగా



సీతారాంపురం సౌత్‌లో అమ్మవారు



నరసాపురం: కూష్మాండ దుర్గాదేవి అలంకరణలో..

కరుణించమ్మా.. దుర్గమ్మా

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు పాలకొల్లు పట్టణంలో నాలుగో రోజు ఆదివారం కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. పలు ఆలయాలు, కూడళ్ల వద్ద అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఉదయం, సాయంత్రం మహిళలు కుంకుమ పూజలు చేయించుకున్నారు. ● పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ● వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నెలకొల్పిన దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్నారు. ● యడ్లబజారు కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు జరిపించారు. ● రెల్లిపేటలో భవానీ దీక్షా పరులు అమ్మవారిని ప్రతిష్ఠించి నిత్య పూజలు చేస్తున్నారు.

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో దుర్గమ్మ ప్రత్యేక పూజలందుకున్నారు. సీతారాంపురం సౌత్, రుస్తుంబాద, కొప్పర్రు, చిట్టవరం, యర్రంశెట్టిపాలెం తదితర గ్రామాల్లో ఆదివారం దుర్గమ్మ బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా దుర్గమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నిర్వహించిన నిర్వహించిన కుంకుమ పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పెనుగొండ వాసవీశాంతిధాంలో..



మార్టేరు కనకదుర్గమ్మ

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని స్టీమర్ రోడ్డు కూడలిలో పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో అమ్మవారికి ఆదివారం కూష్మాండ దుర్గాదేవి అలంకరణ చేశారు. మొగల్తూరులోని ముక్కువారి వీధి, కుక్కలవారి తోట, కేపీపాలెం, జగన్నాథపురం తదితర గ్రామాల్లో దసరా ఉత్సవ మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో చండీహోమం కొనసాగించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న రామానాయుడు

మంత్రి నిమ్మల ప్రత్యేక పూజలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవ రాత్రులు పురస్కరించుకుని పాలకొల్లు యడ్లబజారు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం అమ్మవారిని దర్శించుకుని నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం పూజలు చేయించుకున్నారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక నగరేశ్వర, మహిషాసుర మర్దని, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం ఉదయం ఏకాదశ రుద్రాభిషేకాలు, సూర్య నమస్కారాలు, మంత్ర పునశ్చరణలు, మహా లింగార్చన, వాసవీ కన్యకా పరమేశ్వరి, మహిషాసుర మర్దని అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. ✦ వాసవీ శాంతి ధాంలో వాసవీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం గోమాత పూజ, పంచామృతాభిషేకాలు, కుంకుమపూజలు, హోమాలు చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పెనుమంట్ర, పోడూరు, ఆచంట, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మార్టేరులో కనకదుర్గమ్మ ఆదివారం శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెనుమంట్ర, నత్తారామేశ్వరం ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆచంట, పెదమల్లం, పోడూరు, పెనుమదం, గుమ్ములూరు, వేడంగి, పోడూరు, తూర్పుపాలెంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు.

కాళీపట్నం పడమరలో పశు వైద్య శిబిరం నేడు

నరసాపురం, న్యూస్‌టుడే: కాళీపట్నం పడమరలో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించనున్నామని ఆ శాఖ వైద్యురాలు జి.నీలిమ తెలిపారు. పశు పోషకులు వారి పశువులను శిబిరానికి తీసుకు వచ్చి వైద్య సేవలు అందించేందుకు సహకరించాలని ఆమె సూచించారు.

మురుగు పారదు.. సమస్య తీరదు

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం భగ్గేశ్వరంలో పెచ్చెట్టి వారి వీధిలో రహదారిపై మురుగు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు సాగించడానికి ఇబ్బందులు స్థానికులు గురవుతున్నారు. ఆ మురుగు నీటిలో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. భరించలేని దుర్వాసన వస్తోంది. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆస్తి వివాదం అన్నదమ్ములపై కేసు

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఆస్తి వివాదంలో కొట్లాడుకున్న ఇద్దరు అన్నదమ్ములపై ఆదివారం వేర్వేరుగా కేసులు నమోదు చేశామని ఎస్సై జి.వాసు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై కథనం మేరకు జిల్లేడుతిప్ప గ్రామానికి చెందిన సోదరులు ఉల్లంపర్తి సత్యనారాయణ, శ్రీరామమూర్తిలు ఆస్తి వివాదంలో ఒకరినొకరు కొట్టుకుని చికిత్స నిమిత్తం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు వారిరువురిపై వేర్వేరుగా కేసులు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

పంట కాలువ కనుమురుగు

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా క్షేత్ర స్థాయిలో ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. ఇటు అధికారుల నిర్లక్ష్యం.. అటు ప్రజల అవగాహన లోపం వెరసి ఈ చెత్త అనేక సమస్యలకు నెలవుగా మారుతోంది. మాముడూరు గ్రామ సచివాలయానికి అతి సమీపంలో సీసీ రహదారి చెంతనే చెత్త పడేస్తున్నారు. ఇదంతా పక్కనే ఉన్న పొలాలకు నీరందించే పంట కాలువలో చేరి పూడిపోతోంది. పైగా ఈ మార్గంలో ప్రయాణించడానికి వీలు లేనంత దుర్వాసన వెదజల్లుతోంది. పంచాయతీ యంత్రాంగం కేవలం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి చేతుల దులుపుకోవడం, గ్రామానికి ప్రజాప్రతినిధులు, అధికారులు వస్తున్న సందర్భంలో కాస్త శుభ్రం చేస్తున్నారు తప్ప పరిష్కారం దిశగా చర్యలు ఉండట్లేదు. స్థానికంగా చెత్త సంపద కేంద్రం అందుబాటులో ఉన్నా వినియోగించడం లేదు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ సందర్భంలో మాత్రం దీనిని అందంగా ముస్తాబు చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, పెనుమంట్ర**



కాలువ చెంత పడేసిన చెత్తాచెదారం

గోతుల దారి.. పడతారు జారి..

పెనుగొండ - మార్టేరు ఆర్ అండ్ బీ రహదారిలో పెనుగొండ లింగాల వీధి సమీపంలో రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారుల రాక పోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో గోతులు పడటంతో కొద్దిపాటి వర్షం వస్తే వర్షపు నీరు నిలిచి వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. రాళ్లు పైకి లేచి ఉండటంతో వాహనాల టైర్లు పంక్చర్లు అవుతున్నాయని పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలు బారిన పడి గాయాల పాలవుతున్నారు. గోతులు గుర్తించే లోపే వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పుతున్నాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణం స్పందించి మరమ్మతు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఆర్ అండ్ బీ ఏఈ టీఆర్వీ ప్రసాద్ వివరణ కోరగా వర్షాలు తగ్గిన తర్వాత మరమ్మతులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, పెనుగొండ**



వ్యర్థాలు వదలడానికి బైపాస్ రోడ్డే ఆధారమా?

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు - పూలపల్లి బైపాస్ రోడ్డు నందు చుట్టుపక్కల పలు ప్రాంతాల నుంచి వస్తున్న మరుగుదొడ్డి శుభ్రపరిచే వాహనాలు రహదారి పక్కనే ఉంచుతున్నారు. ఇళ్లలోని ట్యాంకుల నుంచి వ్యర్థాలను తీసుకువచ్చి రహదారి దిగువ ప్రాంతానికి వదులుతున్నారు. బైపాస్ రోడ్డుకు అనుకొని ఉన్న రహదారిలో రైతులు వారి పొలాలకు వెళ్తుంటారు. ఆ రహదారిలో ట్యాంక్ నుంచి వచ్చిన వ్యర్థపు నీరు రహదారిపై ఉండిపోయి ఈ మార్గం గుండా వెళ్లాలంటే నరకప్రాయంగా ఉంటుందని, దుర్వాసన అధికంగా వస్తోందని పలువురు రైతులు వాపోతున్నారు.



సెప్టిక్ ట్యాంకర్ నుంచి బైపాస్ రోడ్డులో వదులుతున్న మురుగు



ట్యాంకర్‌లోని మురుగును వదలడం వల్ల అధ్వానంగా మారిన మార్గం

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

ముగిసిన ఉపవాస కూడికలు



తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : తణుకు మండలం దువ్వ సాల్వేషన్ ఆర్మీ చర్చిలో మూడు రోజులుగా జరుగుతున్న ఉపవాస ప్రార్థనలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు జయనంద, లత జోషిలు బోధనలు చేశారు. విశ్వాసులు ప్రభువుని ఆరాధించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

తొలగిన చెత్త

ఈనాడు కథనానికి స్పందన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని మున్సిపల్ పార్కు వద్ద చెత్త మేట వేసింది. దీనిపై 'ఈనాడు'లో పట్టింపులేని పారిశుద్ధ్యం శీర్షికన ఆదివారం చిత్ర కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కమిషనర్ ఏసుబాబు పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా చెత్త తొలగించారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలి

మార్టేరు, న్యూస్‌టుడే: లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని సీపీఎం మండలం కార్యదర్శి కె.సుబ్బరాజు ఒక ప్రకటనలో హెచ్చరించారు. బిల్లులు చెల్లించకపోతే సరఫరా నిలిపివేసే విద్యుత్తు శాఖ వినియోగదారులకు ఎందుకు నాణ్యమైన విద్యుత్తు అందించలేక పోతోందని ప్రశ్నించారు.

నిఘా నేత్రం.. నామమాత్రం..!

☛ కడకట్ల వంతెన, యాగర్లపల్లి, హౌసింగ్‌బోర్డు, డీఎస్ చెరువు, సుబ్బారావుపేట, వీకర్స్ కాలనీ, గణేశ్‌నగర్, కొబ్బరితోట, పోలీస్ ఐలాండ్ వంటి ప్రాంతాల్లో నిఘా నేత్రాలు పనిచేయడం మానేశాయి. వీటిని పునరుద్ధరించాలంటే రూ.6 లక్షలు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం మున్సిపల్ సాధారణ నిధుల నుండైనా సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇటీవల రూ.లక్ష వెచ్చించి మరమ్మతులు నిర్వహించామన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే : పాత నేరస్థులు, దొంగతనాలు, సంఘ విద్రోహులు కదలికలను పసిగట్టడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. కేసుల దర్యాప్తులో సీసీ ఫుటేజీ కీలకంగా మారుతున్నాయి. తాడేపల్లిగూడెం, తణుకు పట్టణాల్లోని కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు చాలా వరకు పని చేయడం మానేశాయి. మరి కొన్ని చోట్ల నిఘా నేత్రాలు లేకపోవడంతో చోరీలు, రోడ్డు ప్రమాదాలు, తదితర సంఘటనల జరిగిన తీరు తెలుసుకోవాలంటే పోలీసులు అవస్థలు పడుతున్నారు.




పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం

తాడేపల్లిగూడెం పుర పాలక సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు పని చేయడం లేదు. మూడేళ్ల కిందట రూ.24 లక్షల విరాళాలు సేకరించి పట్టణ పరిధిలోని ప్రధాన కూడళ్లు, రహదారులు, సమస్యాత్మక ప్రాంతాల్లో 68 సీసీ కెమెరాలు అమర్చారు. వీటితో పాటు మరో 54 కెమెరాలు ఏర్పాటు చేశారు. పర్యవేక్షణకు వీలుగా పట్టణ పోలీస్ స్టేషన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. నిర్వహణకు సంబంధించి నిధులు కేటాయించకపోవడంతో చాలా కెమెరాలు మరమ్మతుకు గురయ్యాయి.



కడకట్ల వంతెనపై నేల చూపులు చూస్తున్న సీసీ కెమెరా

తాడేపల్లిగూడెం పట్టణ జనాభా: 1.20 లక్షలు



అరకొరగా..

తణుకు పట్టణంలో సరైన నిఘా నేత్ర పర్యవేక్షణ కొరవడింది. ఏటా రూ.కోట్ల ఆదాయం చేకూరుస్తున్న పట్టణంలో ఇటు మున్సిపాలిటీ, పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయలేకపోయారు. ఇప్పటి వరకు కేవలం 20 కెమెరాలతోనే నెట్టుకొస్తున్నారు. దొంగతనాలు, ప్రమాద ఘటనలు జరిగినప్పుడు సరైన నిఘా లేకపోవడంతో కేసుల ఛేదనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఛేదించాల్సిన కేసులు నెలలు, సంవత్సరాలు పడుతున్న సందర్భాలు ఉన్నాయి. ప్రధాన కూడళ్లు మినహా ఎక్కడా నిఘా నేత్రాలు కనిపించని పరిస్థితి నెలకొంది. కేవలం 20 కెమెరాలు ప్రధాన కూడళ్ల వద్ద అమర్చారు.

తణుకు పట్టణ జనాభా: 95 వేలు
కెమెరాలు: 20 కావాల్సినవి: 140

ఆగని ఇసుక దందా

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలంలోని ఎర్ర కాలువకు ఇటీవల వచ్చిన వరదలకు పెద్ద ఎత్తున ఇసుక మేట వేసింది. పొలాల్లో, చేల గట్లపై ఇసుక నిల్వ చేస్తున్నారు. అనంతరం అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా రాత్రుళ్లు తరలిస్తున్నారు. ట్రాక్టరు ట్రక్కు ఇసుకను దూరాన్ని బట్టి రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తున్నారు. గోదావరితో పాటు వాగులు, వంకలు పొంగి పొర్లడంతో ఇసుక కొరత ఏర్పడింది. దీంతో భవన నిర్మాణాలు నెమ్మదించాయి. ఈ క్రమంలో అక్రమార్కులు ఇసుక దందాకు తెరలేపారు. ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తున్నారు. "ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఏర్పాటు చేస్తాం. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం." అని తహసీల్దారు సునీల్‌కుమార్ అన్నారు.



పొలాల్లో నిల్వ ఉంచిన ఇసుక




కాలువ గట్టు పై..

ప్రారంభానికి మీనమేషాలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు పట్టణం సంత బజారులోని చేపల మార్కెట్ పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. పట్టణంలోని చేపల వ్యాపారులకు అవస్థలు తప్పడం లేదు. గత తెదేపా హయాంలో ఆదివారం సంత బజారులో చేపల మార్కెట్ నిర్మించారు. దీనిని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.





తాడేపల్లిగూడెం: ... | తాడేపల్లిగూడెం వార్పు రోడ్డులో.. | తణుకు: గాయత్రీదేవిగా వాసవీమాత | భాగ్యలక్ష్మీపేటలో.. | దువ్వ: దానేశ్వరి | బైరాగిమఠంలో..

దివ్యరూపిణి.. నిత్యానందకారిణి



గొడుగుల అలంకరణలో బలుసులమ్మ ఆలయ ప్రాంగణం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాడేపల్లిగూడెం పట్టణంలోని వివిధ ఆలయాలు, మండపాలల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. వివిధ పార్టీ నాయకులు, పుర ప్రముఖులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: మండపాక యల్లారమ్మకు సోమవారం విశేష పూజలు చేసి అమ్మవారిని అలంకరించారు. ● దువ్వ దానేశ్వరికి ఆదివారం కుంకుమార్చన చేసి అలంకరించారు. ● పట్టణంలోని వాసవీ ప్రార్థన మందిరంలోని వాసవీమాతను గాయత్రీదేవి అలంకరణ చేశారు.

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: వీరంపాలెంలోని బాలాత్రిపుర సుందరిదేవి భక్తులకు కూష్మాండదేవిగా దర్శనమిచ్చారు. గరిమెళ్ల వెంకటరమణశర్మ మాట్లాడారు. అనంతరం చండీ హోమం నిర్వహించారు.

తాడేపల్లిగూడెం టూటౌన్, పెంటపాడు, న్యూస్‌టుడే: ముత్యాలంపాడులోని కొలువైన శ్రీముత్యాలమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారు ఆదివారం అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో హరేరామప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ● ప్రత్తిపాడు వైకూడలిలో కనకదుర్గమ్మ, రావిపాడు శివారు ముళ్లమ్మతల్లి, దర్శిపర్రు శ్రీపార్వతి బ్రహ్మలింగేశ్వర, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కాగులంపాడులోని స్వయంభూ కనకదుర్గమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

ఆదమరిస్తే అంతే ..



తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : తేతలి నుంచి లలితానగర్ మీదుగా తణుకు వచ్చే దారిలో డ్రెయిన్‌పై రక్షణ మూత లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి ఈ సమస్య ఉన్నా... అధికారులు పట్టించుకోవడంలేదని దీంతో రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారని చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఈవోపీఆర్‌డి రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.

చెరువు...చూస్తే గుండె బరువు



తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణ నడిబొడ్డున ఉన్న కొండయ్య చెరువు నీటిని తాగునీటి అవసరాలకు గతంలో వినియోగించుకునేవారు. సుదూర ప్రాంతాల నుంచి మంచినీటి కోసం చెరువు వద్దకు వచ్చేవారు. కాలక్రమేణా మురుగు కూపంలా, దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. ఈ చెరువు అభివృద్ధికి కృషి చేస్తామన్న పాలకుల మాటలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. అయిదేళ్ల కిందట చెరువు అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత ద్వారా రూ.48 లక్షలు మంజూరయ్యాయి. చెరువు శుభ్రం చేసి వాకింగ్ ట్రాక్, రిటైనింగ్ వాల్ నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం ఒకవైపు మాత్రమే రిటైనింగ్ వాల్ నిర్మించారు. ఈ కాస్త పనులకే కేటాయించిన నిధులు కరిగిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నీటితో నిండిపోయింది. నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోజుల తరబడి నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. దీనిపై కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ చెరువు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

పేరు ఘనం.. సౌకర్యాలు శూన్యం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌కు రాష్ట్రవ్యాప్తంగా పేరు ఉంది. నిత్యం రూ.కోట్లలో వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి. ఉల్లి, టమాటా వంటి ఉత్పత్తులు ఎగుమతులు, దిగుమతులు అవుతుంటాయి. హోల్‌సెల్ పండ్ల వ్యాపారానికి మార్కెట్ కేంద్రంగా మారింది. అటువంటి మార్కెట్ సమస్యల కోరల్లో కొట్టుమిట్టాడుతోంది. ప్రతి ఆదివారం జరిగే సంతకు పట్టణానికి సమీపంలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు వస్తుంటారు. నిత్యావసర సరకులు కొనుగోలు చేస్తారు. పుర పాలక సంఘానికి పెద్ద ఎత్తున ఆదాయం కూడా వస్తుంది. అయినా మౌలిక వసతుల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. కనీసం మంచినీటి వసతి కూడా లేకపోవడం గమనార్హం. వాన వస్తే బురద, ఎండ వస్తే దుమ్ముతో మార్కెట్ లోపలకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొందని అటు వినియోగదారులు, ఇటు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. రహదారులు గుంతలతో అధ్వానంగా ఉన్నాయి. "మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతాం" అని కమిషనర్ ఏసుబాబు అన్నారు.



అపరిశుభ్రంగా బ్రహ్మానందరెడ్డి మార్కెట్



ప్రమాదకరంగా గుంత

కుంచనపల్లి (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే : పంచాయతీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు పిలుపునిచ్చారు. కుంచనపల్లిలో ఆదివారం గ్రామ పంచాయతీ

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

వర్కర్స్ యూనియన్ సంఘ అధ్యక్షుడు తాడేపల్లి సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి హరీశ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి వాసు, కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీర్రాజు

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కొండ్రుప్రోలు గ్రామం కేఎస్ఎన్ కాలనీ వద్ద జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. బాపులపాడు మండలం, వేలేరుకు చెందిన సూరపనేని నరేశ్ డీసీఎమ్ వ్యాన్‌లో వెళుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు గాయపడ్డారు.

చోరీ కేసులో దొంగ అరెస్టు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణం కృష్ణానగర్‌లో గత నెల 21న ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసుకు సంబంధించి అంతర్ జిల్లా దొంగను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ సుధాకర్‌బాబు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన వెల్లడించారు. కృష్ణానగర్‌లో నాగరాజు ఇంటిలో వేములపల్లి విజయ్‌కుమార్ అనే యువకుడు చోరీకి పాల్పడి బంగారు నగలు, నగదును తీసుకెళ్లాడు. పట్టణ సీఐ యల్లమరాజు, ఎస్‌ఐలు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, నాగేశ్వరరావులు విచారణ జరిపి నిందితుడిని ఈ నెల 5న రాజంపేట రైల్వేస్టేషన్‌కి సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.6,93,800లు విలువ చేసే 138.76 గ్రాముల బంగారు, రూ.9,650లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. నిందితుడు విజయకుమార్‌పై వివిధ పోలీస్టేషన్లలో 41 దొంగతనం కేసులున్నట్లు చెప్పారు. గత రెండేళ్లలో సామర్లకోట పోలీస్టేషన్ పరిధిలో మూడు, రాజమండ్రి పరిధిలో రెండు కేసులు, అనపర్తి పరిధిలో రెండు, తాడేపల్లిగూడెం పరిధిలో రెండు, తణుకు, ద్వారకా తిరుమల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక్కొక్క కేసు ఉన్నట్లు వివరించారు. ఈ మేరకు కేసును త్వరగా ఛేదించిన సీఐ, ఎస్‌ఐలను డీఎస్పీ అభినందించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ సుధాకర్‌బాబు

తణుకు నుంచి కానూరు వెళ్లే మార్గం ఇది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ప్రసాద్ థియేటర్ సమీపంలోని ఓ దుకాణం వద్ద వాహనం నిలిపి, ఎగుమతులు, దిగుమతులు చేస్తుంటారు. రహదారిపైనే కాటా తూస్తుంటారు. రహదారిని అక్రమించి కార్యకలాపాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.



అసలే ఇరుకు మార్గాలు.. ఆపై ఆక్రమణలు..!

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు పట్టణంలో ఇరుకు దారులు.. కనీసం వాహనాలు నిలిపేందుకు స్థలం కేటాయించలేని పరిస్థితి నెలకొనడంతో చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు కొందరు రహదారులు, పార్కింగ్ ప్రదేశాలను అక్రమించి కార్యకలాపాలు సాగిస్తున్నారు. నిత్యం పట్టణంలోకి తణుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వివిధ పనుల నిమిత్తం ప్రజలు వస్తుంటారు.

ఇది పట్టణ నడిబొడ్డులోని ప్రాంతం. వివిధ దుకాణాల సముదాయాలు ఇక్కడ ఉన్నాయి. పార్కింగ్ ప్రదేశంలో పూల కుండీలు పెట్టడంతో వాహనాలు నిలిపేందుకు చోదకులు నానా తంటాలు పడుతున్నారు. రహదారిపై వాహనం నిలుపుద చేస్తే పోలీసులు చలానాలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆటో డ్రైవర్ ఆత్మహత్య

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే : ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటనపై పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. స్థానిక వీకర్స్ కాలనీకి చెందిన అళ్ల లోవరాజు(35) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పట్టణంలోని వార్ఫు రోడ్డుకు చెందిన హిజ్రాతో లోవరాజుకు వివాహేతర సంబంధం ఉంది. కొంతకాలంగా భార్యను వీడి హిజ్రాతోనే సహజీవనం సాగిస్తున్నారు. శనివారం ఉదయం డబ్బులు విషయమై లోవరాజుకు, హిజ్రాకు మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన హిజ్రా ఇంట్లోని గాలి పంకాకు ఉరేసుకుని మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అళ్ల లోవరాజు(35)